VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం A 193

సుప్రీం సోవియట్ ఎన్నికలు
మాస్కో నియోజకవర్గంనుండి తిరిగి పోటీచేయడానికి కృశ్చేవ్ సమ్మతి

మాస్కో, ఫిబ్రవరి 8

సుప్రీం సోవియట్‌కు దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికలలో మాస్కో నియోజకవర్గంనుండి తిరిగి పోటీ చేయడానికి సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి నికిటా కృశ్చేవ్ అంగీకరించారు.

ఎన్నికలు మార్చి 16వ తేదీన జరుగుతాయి.

విశాలాంధ్ర

7c5886

సంపుటి 6 * విజయవాడ సోమవారం మాఘం 21-1879 [ఫిబ్రవరి 10-1958] * సంచిక 311

Iris Inks for
ALL PENS IN FIVE COLOURS
ఐరిస్ సిరాలు
ఫౌంటెన్ కలాలకు చాలా మంచివి.
తయారు చేయువారు :
Research Chemical Laboratories,
Madras-4, Bangalore-3 New Delhi-1.
RECHLAB'S Iris INK

ట్యునీషియా గ్రామంపై 25 ఫ్రెంచి విమానాల దారుణమైన దాడి

తమ భూభాగంనుంచి ఫ్రెంచి సేనలు వైదొలగాలని ట్యునీషియా అధ్యక్షుని హెచ్చరిక

ముక్కుపచ్చలారని బడిపిల్లలు కూడా బాంబులకు ఆహుతి

ట్యూనిస్, ఫిబ్రవరి 8

ఫ్రెంచి విమానాలు నేడొక ట్యునీషియన్ గ్రామం మీద బాంబులు కురిపించి వందమంది ప్రజలను హత్య చేశాయి. ఈ దాడిలో దాదాపు 75 మంది గాయపడ్డారని తెలుస్తోంది. ఒక పాఠశాల మీద బాంబులు వేయగా అక్కడ చదువుకొంటున్న బాలబాలికలందరూ మరణించారు.

ఈ బాంబులవర్షంవల్ల గ్రామంలో మూడింట రెండువంతులు సర్వనాశనం అయింది.

సాకియత్ సిదీయూసఫ్ అనే అల్జీరియా-ట్యునీషియా సరిహద్దు గ్రామములో విమాన విధ్వంసక శతఘ్ని స్థావరాలున్నాయనీ, ఒక ఫ్రెంచి గస్తీవిమానంమీద యీ శతఘ్నులు దాడిచేశాయనీ అందుకని ఆ స్థావరాలను ధ్వంసం చేయడానికి 25 ఫ్రెంచి విమానాలు బాంబులు కురిపించాయనీ ఫ్రెంచి సైనికాధికారులు ప్రకటించారు.

దెబ్బతిన్న ఫ్రెంచి విమానం బలవంతాన ట్యునిస్ భూభాగం మీద దిగవలసి వచ్చిందని వారు పేర్కొన్నారు.

ఇప్పుడు ఫ్రెంచి విమానాలు చేసిన దాడిలో రెండు ట్యునీషియా విమాన విధ్వంసక శతఘ్ని స్థావరాలు నాశనమయ్యాయనీ, మూడవస్థావరం దెబ్బతిన్నదనీ చెపుతున్నారు. ఈ గ్రామానికి దగ్గిరలోనే గల ఒక అల్జీరియా తిరుగుబాటుదార్లశిబిరం కూడా సగం దెబ్బతిందని చెపుతున్నారు.

మొనస్టిర్ అనే ప్రాంతంలో విశ్రాంతితీసుకొంటున్న ట్యునీషియా అధ్యక్షుడు బోర్గిబియా ఈ దారుణ వార్తను వినగానే ట్యునిస్‌కి తిరిగి వచ్చి అసాధారణ మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటుచేశారు.

పారిస్‌లో ట్యునిషియా రాయబారి మహ్మద్ మసౌదీ ఫ్రెంచి విదేశాంగమంత్రి క్రిస్టియన్ పినేలో దుస్సంఘటన విషయమై మాట్లాడాలని కోరారు.

సంప్రతింపులకోసం మసౌదీని ట్యునీషియా ప్రభుత్వం స్వదేశానికి రావలసిందని పిలిచినట్లు ట్యునీషియా రాయబార కార్యాలయంవారు తెలుపుతున్నారు.

ట్యునీషియా భూభాగంలో విమాన విధ్వంసక స్థావరాలు అక్రమంగా పనిచేస్తున్నాయికనుక ఫ్రెంచివైమానికులు న్యాయంగా తమ రక్షణహక్కును వినియోగించుకొన్నారేకాని అంతకుమించి ఎట్టి అతిక్రమమూ చేయలేదని ఫ్రెంచి రక్షణమంత్రి జాక్వెస్ షాబన్ డెల్మాస్ నేటిరాత్రి ప్రకటించారు.

ఫ్రెంచివిమానాలకు వైమానికులకు జరిగిన నష్టాన్నిబట్టి చూస్తే ఇలాంటి చర్య తప్పనిసరి అని ఆయన అన్నారు.

ఈగ్రామం అల్జీరియా-ట్యునీషియా సరిహద్దులో ఉంది. దీనిసమీపంలోనే జనవరి 11వ తేదీని అల్జీరియా విముక్తి సైనికదళ మొకటి ఒక ఫ్రెంచి పటాలంపై దాడి చేసింది. అప్పుడు పదిహేనుగురు ఫ్రెంచి సైనికులు చనిపోయారు. 5 గురు పట్టుబడ్డారు. పట్టుబడినవాళ్లలో ఒకడు తరువాత చనిపోయాడు.

మిగిలిన నలుగురు ఫ్రెంచి సైనికులను పట్టుకొని అల్జీరియా వారు ట్యునీషియా ప్రాంతంలోకి పారిపోయారనీ, దీనికి ట్యునీషియా అధికారుల మద్దతు ఉందనీ ఫ్రెంచి అధికారు లన్నారు. ట్యునీషియా ప్రభుత్వం ఈ ఆరోపణను ఖండించింది. ఆ ఫ్రెంచి ఖైదీలు అల్జీరియాలోనే ఉన్నారనీ, అల్జీరియా విప్లవ నాయకులు తెలిపారుకూడా. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు వారిని చూచారనికూడా వీరన్నారు.

ఈ సాకుతో ఫ్రెంచి పటాలాలు ట్యునీషియా సరిహద్దును అతిక్రమించడం ఇటీవల ఇంకా ఎక్కువ చేశాయి.

ఫ్రెంచి దురంతాలకు వ్యతిరేకంగా ప్రదర్శనాలు

ఫ్రెంచివారి దారుణచర్యను నిరసిస్తూ కఫ్‌లో వేలాది ట్యునీషియన్లు ప్రదర్శనలు చేశారు. విమాన దాడిలో గాయపడిన వారిని కొందరిని ఇక్కడకు కొనివచ్చిన సందర్భంలో ఈ ప్రదర్శనలు జరిగాయి. అయితే ఈ దారుణ సంఘటనవార్త ఇంకా దేశమంతటా వ్యాపించలేదు. ట్యునిస్‌మంత్రివర్గ అత్యవసర సమావేశానంతరం ప్రభుత్వం ఒక ప్రకటన చేయగలదని అనుకొంటున్నారు.

ట్యునీషియాలో వున్న ఫ్రెంచి దౌత్య వ్యవహర్త జీన్ సియొర్రీ బెనార్డ్‌ని మాట్లాడడానికి రావలసిందని ట్యునీషియా అధ్యక్షుడు బోర్గిబియా పిలిచారు.

సకియత్ సిదీ గ్రామం

సకియత్ సిదీయూసుఫ్ గ్రామ జనాభా పన్నెండు వందలు. ఈశాన్య ట్యునీషియాలోని లేకెఫ్ నుంచి అల్జీరియాలోని సౌక్ అహార్స్‌కి వెళ్లే దారిలో ఉభయదేశాలకు సరిహద్దున వుందీ గ్రామం. ఈ గ్రామందగ్గిర సీసం, తుత్తునాగం గనులువున్నాయి. ప్రాచీన రోమన్ నగరమైన నగ్రగర శిథిలాలు కూడా ఇక్కడకు అనతిదూరంలోనే వున్నాయి.

ఈ దాడిలో నూర్గురకుపైగానే మరణించారని ట్యునీషియా అధికారులు చెపుతున్నారు. గ్రామానికి అరమైలు దూరంలోవున్న పాఠశాల మీద బాంబులు వేయడంవల్ల అక్కడ చదువుకొంటున్న బాలబాలికలంతా మరణించారు.

బాంబుల దాడివల్ల స్థానికప్రభుత్వ ప్రధాన కార్యాలయం, పోలీసు స్టేషను, పోస్టుఆఫీసు, ప్రాంతీయ సైనిక కార్యాలయం అన్నీ ధ్వంసమైపోయాయి.

మరణించినవారి కంకాళాలు అయిదింటిని వెలికి తీసినట్లు తొలివార్తలు తెల్పుతున్నాయి. గాయపడిన 40 మందిని మాత్రమే చికిత్సకు పంపారు.

ఫ్రెంచివారి కథనం

ఒక ఫ్రెంచి గస్తీ విమానం అల్జీరియా మీద ఎగురుతుండగా దాన్ని కాల్చారనీ అప్పుడదిబలవంతాన క్రిందికి దిగవలసివచ్చిందని ఫ్రెంచి సైనికవర్గాలవారు చెపుతున్నారు. ఈ సంఘటన జనవరి 29 న జరిగిందనీ,ఆతర్వాత సకియాత్ సిదీయూసఫ్ గ్రామంవద్ద నిన్న మరొక్క ఫ్రెంచి విమానంమీద కాల్పులు జరిగాయనీ వారంటున్నారు.

ఇలాంటి సంఘటన తిరిగి జరిగితే తీవ్ర ప్రతీకారచర్య తీసుకొంటామని అప్పుడు ఫ్రెంచి కావలిసేనాని ట్యునీషియా కావలి సేనలకు హెచ్చరిక చేశాడంటున్నారు.

భారత కాలమానం ప్రకారం నేటి ఉదయం 8-15 గంటలకు ఫ్రెంచి గస్తీవిమానంపై ట్యునీషియా వారు మరఫిరంగులతోను, శతఘ్నులతోను దాడి చేసినట్లు పారిస్‌వర్గాలవారు చెపుతున్నారు.

అప్పుడు 25 ఫ్రెంచి విమానాలు బాంబులవర్షం కురిపించి ఆ గ్రామాన్ని నాశనంచేశాయి అని చెబుతున్నారు.

అల్జీరియాలో ఫ్రెంచివారి ఘాతుకాలకు నిరసనగా లండన్‌లో ప్రదర్శనలు

లండన్, ఫిబ్రవరి 8

అల్జీరియాలో 22 సంవత్సరాల మహిళ జమీలా బౌహిరెడ్‌కు మరణశిక్ష విధించినందుకు నిరసనగా నేడిక్కడ ఫ్రెంచిసైనిక ప్రతినిధి కార్యాలయంముందు వేలాది సోషలిస్టులు ప్రదర్శనం జరిపారు.

వలస స్వాతంత్ర్య పక్షపాతులు కూడా ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. అల్జీరియాలో ఫ్రెంచిఘాతుకాలు నశించాలనీ, జమీలాను రక్షించాలనీ నినాదాలు గల అట్టలను వారు పట్టుకొనివచ్చారు.

ఒక బాంబు కేసు సందర్భంలో అల్జీరియా సైనిక న్యాయస్థానంవారు [illegible] జమీలాలకు మరణ శిక్షవిధించారు.

ప్రతిశనివారమూ ఈవిధంగా ప్రదర్శనలు చేయ నిశ్చయించినట్లు వలస స్వాతంత్ర్యోద్యమంవారు పత్రికలవారితో చెప్పారు.

ప్రపంచ అద్భుతాల్లో భాక్రా ఆనకట్ట ఒకటి

వియత్నాం అధ్యక్షుడు డాక్టర్ హో ప్రశంస

నంగల్, ఫిబ్రవరి 8

వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ అధ్యక్షుడు డాక్టర్ హోచిమిన్ నేటి వుదయం ఇక్కడ భాక్రా ఆనకట్ట స్థలాన్ని సందర్శించారు. ఉరకలు వేసుకొంటూ ప్రవహిస్తున్న సట్లెజ్ నదిగట్టుపై డాక్టరు హో నిలబడి, "మీ ఇంజనీర్లు మీకోసం చేసిన అద్భుతసృష్టి ఇది. మీరు సాధించిన ఈ ఘనవిజయాన్ని మావిజయంగా కూడ ఎంచుకొంటున్నాం" అన్నారు.

డాక్టర్ హో ఒకఇంటర్‌వ్యూలో తన అనుభవాలను వివరిస్తూ "మా మిత్రుడు పండిత నెహ్రూ, పంజాబ్ గవర్నరు, చీఫ్ ఇంజనీరుల అనుమతితో మేము భాక్రాఆనకట్టను సందర్శించాము. ప్రపంచంలోని అద్భుతాలలో ఇదొకటి" అన్నారు.

"మీరు ఏమి నిర్మిస్తున్నారో, ఎవరికోసం కృషిచేస్తున్నారో తెలుసా?" అని ప్రశ్నించి, "మీ సౌభాగ్యంకోసం, మీ బిడ్డల సౌభాగ్యంకోసం, శాంతి, ప్రజాస్వామ్యంకోసం మీరు కృషిచేస్తున్నారు" అని చెప్పారు.

వియత్నాంలో ఇలాంటి ప్రాజెక్టులు నిర్మించడానికి పథకాలు వేస్తున్నారా? అని అడుగగా డాక్టరు హో ఇలా అన్నారు: "భారతదేశం అమలుజరుపుతున్న బ్రహ్మాండమైన అభివృద్ధి కార్యాలను చూడటానికై మేము ఇక్కడికి వచ్చాము. మీ అమూల్యమయిన అనుభవాల నుండి మేము నేర్చుకొంటాము. మీ దేశంలో వలె మాకు కూడ దారిద్ర్య సమస్య వుంది. మీ దేశంలోవలె మేము కూడ తక్కువ ఆదాయంతో జీవనం గడుపవలసి వస్తున్నది. మానవజాతికి ఇవి రెండూ జంటశత్రువులు. మీవలె మేముకూడ ఈరెండింటితో పోరాడుతున్నాము."

డాక్టరు హో పంజాబ్‌గవర్నర్ వైపు తిరిగి "మీ పని పూర్తి కాగానే మంచి అనుభవశాలురైన మీ ఇంజనీర్లను మాదేశానికి పంపగలరని ఆశిస్తున్నారు" అని చెప్పారు. భారతదేశం సాధించిన విజయాలకు తన తరఫున, తనదేశప్రజల తరఫున అభినందనలు అందజేశారు. సమీప భవిష్యత్తులో భారతదేశం ఇంకా ఎక్కువ విజయాలు సాధించగలదనే ఆశాభావం ప్రకటించారు.

వియత్నాం ఉపప్రధాని ఫాన్‌కెటోయ్ ఒక ఇంటర్‌వ్యూలో "అయిదు శతాబ్దాలకు పూర్వం స్వదేశంలోనే కాకుండా, ఆసియా అంతటా పెద్ద పెద్ద కట్టడాలు ఎన్నో నిర్మించిన భారతీయుల యశోవిభవానికి అనుగుణంగానే వుంది ఈ ఆనకట్ట" అని చెప్పారు. ఆనకట్టను నిర్మిస్తూన్న కార్మికులకు శుభాకాంక్షలు, ధన్యవాదాలు సమర్పించారు.

డాక్టరు హోచిమిన్ తన పరివారంతో పాటు నేటి వుదయం ప్రత్యేక రైలులో ఢిల్లీ నుండి నాంగల్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. పువ్వులతోను, భారత - వియత్నాం దేశాల జాతీయ పతాకాలతోను రైల్వే స్టేషన్ చక్కగా అలంకరించబడి వుంది. అక్కడ కాచుకొనివున్న ప్రజలు, పంజాబు గవర్నరు శ్రీ సిన్హా డాక్టరు హోకు ఘనస్వాగత మిచ్చారు.

డాక్టరు హో, ఆయన పరివారం తిన్నగా భాక్రా ఆనకట్ట స్థలానికి వెళ్ళారు. దారిలో ఇరుప్రక్కలా వేలాది ప్రజలు నిలబడి స్వాగతం తెలిపారు. డాక్టరు హో మూడు గంటలసేపు భాక్రా ఆనకట్టను చూశారు.

ఆనకట్ట జనరల్ మేనేజర్ శ్రీ ఖంగర్, డాక్టరు హో వెంట వున్నారు. ఈ ప్రాజెక్టుకు 174 కోట్ల రూపాయలు ఖర్చుఅవుతాయని, ఇది 1960 మార్చి నాటికి పూర్తి అవుతుందని డాక్టరు హోకు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిఅయినప్పటినుండి అదనంగా కోటి ఎకరాలకు నీరు లభిస్తుందని, పదిలక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుందని తెలియజేశారు.

డాక్టర్ హో నేటి మధ్యాహ్నం ఇక్కడకు ఆరుమైళ్ళ దూరంలో వున్న బిలాలా అను గ్రామానికి వెళ్లారు. ఊనా సమాజవికాస కేంద్రానికి చెందిన గ్రామం ఇది. ఆ గ్రామ ప్రజలు డాక్టర్ హోకు ఘనస్వాగత మిచ్చారు.

డాక్టరు హోఉపన్యసిస్తూ, 'నేను ఇక్కడ మా సోదర సోదరీ మణుల మధ్యవున్నట్లే భావిస్తున్నాను. వియత్నాముకు,భారతదేశానికీ చాలా పోలికలు వున్నాయి. మన ఉభయదేశాలు శాంతివైపు, శాంతినుండి అభ్యుదయం వైపు పురోగమిస్తాయి' అని చెప్పారు.

పంజాబ్ ప్రజల గాఢ స్నేహానురాగాలను తన దేశ ప్రజలకు అందజేస్తానన్నారు. పంజాబ్ రాష్ట్రం అన్ని విధాల అభ్యుదయం చెందాలనే ఆకాంక్ష వెలిబుచ్చారు.

అంతకుముందు ఊనా జాతీయ విస్తరణ కేంద్ర ప్రజలు డాక్టరు హోకు సన్మానపత్రం సమర్పించారు.

"భారతవియత్నాముల మైత్రి చిరకాలంవర్ధిల్లాలి", "అధ్యక్షుడు హోచిమిన్ చిరకాలం వర్థిల్లాలి", "పండిట్ నెహ్రూ చిరకాలం వర్థిల్లాలి" అనే నినాదాలు ఇవ్వబడ్డాయి.

భాక్రా నాంగల్ ప్రాజెక్టు పూర్తి అయినరోజున తాను టెలిగ్రాము ద్వారా అభినందనాలు పంపుతానని అధ్యక్షుడు హోచిమిన్ వాగ్దానం చేశారు. ఈప్రాజెక్టువద్ద సాగుతున్న కృషినిచూచి ఆయన చాలా సంతోషించారు. ఇది 1960 మార్చి నాటికి పూర్తి అవుతుందని చెప్పగా, "నవభారతదేశ చరిత్రలో అది అత్యంత శుభదినం కాగలదు. మీ విజయాలను అభినందిస్తూ ఆ రోజున నేను ఒక టెలిగ్రాం పంపుతాను. ఎందుకంటే మీ విజయమే మా విజయంగా భావిస్తాము" అని చెప్పారు.

ప్రాజెక్టుపని పూర్తిఅయిన తరువాత ఇక్కడ నియమింపబడిన సాంకేతిక నిపుణులను వియత్నాముకు పంపుతారా? అని ఆయన అడిగారు.

బలంచూపి వ్యవహరించే ధోరణికి చావుదెబ్బ

మాస్కోమేధావులసభలో కృశ్చేవ్ ఉద్ఘాటన

మాస్కో, ఫిబ్రవరి 8

బలంచూపి వ్యవహరించాలనే సామ్రాజ్యవాద నీతి చావుదెబ్బ తిన్నదని, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి నికిటా కృశ్చేవ్ సోవియట్ మేధావులసభలో ప్రసంగిస్తూ చెప్పినట్లు టాస్ వార్తాసంస్థ ప్రచురించింది.

అంతర్జాతీయంగా సోవియట్ పరిస్థితి చాలాచక్కగావుందనిచెప్పవచ్చునని ఆయన అన్నారు. సోవియట్ పలుకుబడి లోగడకన్నా చాలా పెరిగిందన్నారు.

ప్రధాని మార్షల్ బుల్గానిన్, అధ్యక్షుడు వొరోషిలోవ్, ప్రముఖ వాగ్గేయకారుడు డిమిట్రీ షొస్టకోవిచ్, ప్రముఖ రచయిత నికొలాయ్ టిఖనోవ్, ఫిలిం ప్రొడ్యూసరు జార్జి అలెగ్జాండ్రోవ్ మున్నగువారు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఆ సమావేశంలో కృశ్చేవ్ ప్రసంగిస్తూ ఇలా అన్నారు:

రష్యాలో శాస్త్రమూ విజ్ఞానసాంకేతిక విజ్ఞానమూ చాలా ఉన్నత స్థాయిలో పెంపొందినవనీ సోవియట్ పరిశ్రమలు, సంస్కృతి, విద్య చాలా గొప్ప స్థాయికి వెళ్ళాయనీ స్పుత్నిక్ నిర్మాణమే నిరూపిస్తున్నది.

సోవియట్ యూనియన్ శాస్త్ర విజ్ఞానంలోను, సాంకేతిక నైపుణ్యం లోనూ వెనకబడిందని మన శత్రువులల్లిన కాకమ్మకథలు మంచులాగ విడిపోయాయి.

సోషలిజం పెట్టుబడిదారీ విధానాలమధ్య శాంతియుత పోటీలో కొత్తవిజయాలు కాని, కమ్యూనిజం వైపు మరికొంత పురోగమనం కాని సృజనాత్మక కృషి జరిపే మీమీద - కార్మికులు, శాస్త్రజ్ఞులు, సాంకేతిక నిపుణులు అయిన మీమీద ఆధారపడివుంది.

కళారంగంలో మనం అనేక విజయాలు సాధించాం. అయినప్పటికీ ఇంకా కొన్ని శాఖల్లో వెనకపడే వున్నాం.

మన ప్రతికక్షులు రష్యన్ కళలోని ఆశావాదస్వభావాన్ని, బ్రతికే హక్కున్నదన్న భావాన్ని మెచ్చరు. మనరచయితలు, కళాకారులు, గాయకులు, మేధావులు అంతా వేలముఖాలు వేసుకొని జీవితంపట్ల అవిశ్వాసదృష్టితో వుండాలని మన ప్రతిపక్షుల అభిలాష.

ఏమైనప్పటికీ సిద్ధాంతపరమైనపంథాలో మన ప్రతిద్వంద్వులుగావున్న వారి ముందు మనం ఒక్కడుగు కూడా వెనుకకు వేసేదిలేదు. మనసంస్కృతి వేత్తలు, కళాకారుల సృజనాత్మక భావాలు ఇంకా ఎన్నో ఘనవిజయాలను సాధించగలవనడంలో సందేహం లేదు.

ఉభయదేశాల సంబంధాలు బెడిసిపోయాయని స్పష్టీకరణ

ట్యునిస్, ఫిబ్రవరి 8

ఫ్రెంచిట్యునీషియా సంబంధాలు ఇంతవరకు మామూలుగా లేవు ఇకముందు వుండబోవు అని ఫ్రెంచి ప్రతినిధితో తాను చెప్పినట్లు ట్యునీషియా అధ్యక్షుడు బోర్గిబా నేడొక రేడియో ప్రసంగంలో చెప్పారు.

ఈ దారుణసంఘటనను గురించి గింగ్రెన్‌లోని ట్యునీషియా రాయబారికి తెలియపరచానని ఆయన వెల్లడించారు.

ఫ్రెంచిసేనలు వైదొలగడంకోసం పోరాటం ప్రారంభమైందని ఆయన ప్రకటించారు. బైజెర్టాతోసహా అన్ని సేనలువైదొలగేటట్లుచూస్తామన్నారు.

ఫ్రాన్సుతో మేం యుద్ధంచేయడంలేదు. కాని నేటి దాడి మాత్రం శత్రుత్వానికి నాందీవాచకం పలికింది. ఏమైనప్పటికీ మేం మాత్రం శాంతియుతంగానేవుంటాం. మేం శాంతినే నమ్ముతున్నాం. ప్రపంచమే మాకు సాక్షి అని ఆయన పేర్కొన్నారు.

బాంబుల దాడిలో మరణించినవారు మొత్తం 72మందిఅనీ, అందులో 9 మంది స్త్రీలు, 12 మంది బాలురు అనీ రాత్రి అధికార రీత్యా ప్రకటించారు. ఇందులో ఎనిమిదిమంది పిల్లలు పాఠశాలలోనే మరణించారు. 84 గృహాలు, 84 దుకాణాలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు.

ఈ దారుణ సంఘటన జరగగానే ఫ్రాన్సులోని ట్యునీషియా రాయబారిని వెనుకకు పిలిచారు. ట్యునీషియాలో ఫ్రెంచిసేనలు స్థావరముంటాయి. కాని ఇప్పుడు వాటిని వైదొలగవలసిందని అధ్యక్షుడు హెచ్చరించడంతో కొత్త సమస్య ఉత్పన్నమైనదంటున్నారు.

అల్జీరియా విప్లవకారులకు ట్యునీషియా తోడ్పడుతున్నదని ఫ్రెంచివారు చాలా కాలంగా ఆరోపిస్తున్నారు. దానితో ఉభయుల మధ్య ఉద్రేకాలు కూడా పెరుగుతూ వచ్చాయి. ఈ ఉద్రేకం కొసకు నేటి సంఘటనగా పరిణమించింది

ట్యునీషియా మంత్రివర్గం అత్యవసరసమావేశం జరిపి ఫ్రెంచిసేనల సంచారాన్నినిషేధిస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

అమెరికాలోని ట్యునీషియా రాయబారి ఈఉదంతాన్ని అమెరికా విదేశాంగశాఖవారికి తెలియపరిచారు.

ట్యునీషియా ఫ్రెంచి సంబంధాలు బెడిసిపోతాయేమోనని అమెరికా అధికారులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

అరబ్ రిపబ్లిక్ మంత్రివర్గంపై నాజర్ కువాట్లీచర్చ

కైరో, ఫిబ్రవరి 8

ఫిబ్రవరి 21వ తేదీన ప్రజావాక్య నిర్ధారణ ముగియగానే నియమించదగు అరబ్ రిపబ్లిక్ మంత్రివర్గాన్ని గురించి ఈజిప్ట్ అధ్యక్షుడు నాజర్, సిరియాఅధ్యక్షుడు కువాట్లీలు చర్చలు జరుపుతున్నారు.

ఈజిప్ట్‌తో కలవాలన్న సిరియా ప్రజల నిర్ణయమూ, నాజర్‌ని అధ్యక్షునిగా ఎన్నుకోవడమూ ఈ ప్రజావాక్య నిర్ధారణతో తేలిపోతుంది.

అరబ్బు రిపబ్లిక్కుకొక మంత్రివర్గాన్నేకాక ఈజిప్ట్-సిరియాల అంతరంగ పరిపాలనకు రెండు పరిపాలక సమితులను కూడా ఏర్పరచవలసి వుంది.

ఎమెన్ కూడా ఈ అరబ్బు రిపబ్లిక్‌లో చేరాలన్న ప్రతిపాదనకు ఇక్కడ హర్షం వెలిబుచ్చుతున్నారు. కాని రిపబ్లిక్కుకు గట్టిపునాది పడిన తర్వాత అన్ని విషయాలను సమగ్రంగా ఆలోచించిన తర్వాతనే ఈ విషయంపై ఒక నిర్ణయానికి రాగలరని తెలుస్తోంది.

ఈజిప్ట్ సిరియాలు రెండూ రిపబ్లిక్కులే కాబట్టి సంలీనం చాలా సులభం. కాని ఇతర అరబ్బు దేశాలలో చాలా దేశాలు రాచరిక పాలనలో వున్నాయి. అవి ఈరిపబ్లిక్కులో చేరినట్లయితే కొన్ని చిత్రమైన సమస్యలు ఉత్పన్నమౌతాయి. ఐనా ఈ రిపబ్లిక్‌లో చేరే అరబ్బుదేశాల ప్రస్తుత పరిపాలనను గౌరవిస్తామని నాజర్ కువాట్లీలు స్పష్టంచేశారు.

సంయుక్త అరబ్బు రిపబ్లిక్ అవతరణవల్ల అంతర్జాతీయ వ్యవహారాలలో అరబ్బుల పరిస్థితి గట్టిపడుతుందనీ, పశ్చిమాసియాలో శాంతికీ సుస్థిరతకు ఇది తోడ్పడుతుందనీ అరబ్ లీగు ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాలిక్ హస్సూనా అన్ని అరబ్బు రాజ్యాలకు లేఖలు వ్రాశారు.

(మిగతా 4 వ పేజీలో)

భారతదేశానికి కోటి 60 పౌనుల స్టెర్లింగ్ ద్రవ్యం ఇవ్వడానికి బ్రిటన్ ఒప్పుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7

1955 లో చేసుకొన్న స్టెర్లింగ్ పింఛను ఒడంబడిక కింద సాలీనా ఇచ్చే 40 లక్షల పౌనుల స్టెర్లింగ్ కాకుండా 1958 ఏప్రిల్ 1 వ తేదీన అదనంగా భారతదేశానికి 1 కోటీ 20 లక్షల పౌనులు చెల్లించడానికి బ్రిటన్ అంగీకరించింది.

భారతదేశంలో ఉద్యోగం చేసిన బ్రిటిష్ ఉద్యోగులకు పింఛన్ల నిమిత్తం భారతప్రభుత్వం 4 కోట్ల పౌనుల స్టెర్లింగ్ ద్రవ్యాన్ని అదనంగా ఇచ్చినట్లు లోగడ తేలింది. ఈ మొత్తంలో ఏటా 40 లక్షల పౌనులను బ్రిటన్ భారతదేశానికితిరిగిఇచ్చివేస్తున్నది.

1958 ఏప్రిల్‌లో మామూలుగా చెల్లించే ఈ 40 లక్షల పౌనులు కాకుండా, మరో కోటి 20 లక్షల పౌనులను భారతదేశానికి చెల్లించడానికి బ్రిటన్ అంగీకరించినట్లు నేడిక్కడ అధికారరీత్యా ప్రకటింపబడింది.

బ్రిటన్ ఇలా ముందుకు వచ్చినందుకు భారత ఆర్థికమంత్రి ఢిల్లీలోని బ్రిటిష్ హైకమిషనర్‌కు తన అభినందనలు అందజేశారు.

1958-'59 లో భారత విదేశీ మారకద్రవ్య అవసరాల దృష్ట్యా ఇలాంటి సహాయం అందచేయడానికి బ్రిటన్ అంగీకరించింది. ఇందుకు భారతప్రభుత్వం తన ఆమోదాన్ని తెలిపింది.

* * *

లలితకళా అకాడెమీ ఆధ్వర్యాన ఢిల్లీలో శనివారం నాడు జాతీయకళా ప్రదర్శనం ప్రారంభింపబడింది.

సిరియా-ఈజిప్ట్ ఏకీకరణ

భారత ప్రధాని నెహ్రూ హర్షం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8

సిరియా, ఈజిప్ట్‌ల ఏకీకరణ చారిత్రక ప్రాధాన్యమైన విషయమని ప్రధాని నెహ్రూ హర్షిస్తూ ఈజిప్ట్ అధ్యక్షుడు నాజర్‌కు, సిరియా అధ్యక్షుడు కువాట్లీకి సందేశంపంపించారు.

భారతప్రభుత్వం తరఫున, భారత ప్రజలతరఫున, తన తరఫున ఇందుకు స్వాగతం చెబుతున్నానన్నారు. ఈ సందర్భంలో తన హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలను ఈజిప్ట్, సిరియాప్రజలకు అందచేయాలని కోరారు.

* * *

1958 లో భారతదేశంలో ఇదివరకటికంటె ఎక్కువ ఇనుము ఉత్పత్తి అయిందని [illegible], పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ ఎల్. కె. ఝా చెప్పారు.

హేవిళంబి నామ సంవత్సర
చాంద్రమాన మాఘమాసం
బహుళ సప్తమి 17-44
స్వాతి 14-17

విశాలాంధ్ర

సోమవారం 10-2-58
మాఘం 21-1879

చేనేత పరిశ్రమ

చేనేత పరిశ్రమ భారతదేశంలోని అతి ప్రాచీనమైన వృత్తులలో ఒకటి. నాణ్యమైన వస్త్రాల ఉత్పత్తికి పేరుగాంచిన మన నేత పరిశ్రమ బ్రిటిషు పరిపాలనా కాలంలో విదేశ మిల్లుల పోటీకి తట్టుకోలేక, నామమాత్రావశిష్టమయింది.

స్వాతంత్ర్య సంపాదనానంతరం, మిల్లు పరిశ్రమతోపాటు, చేనేత పరిశ్రమకుకూడా రక్షణ కల్పించాలని భారత ప్రభుత్వం గుర్తించింది. కానిచో లక్షలాది చేనేత కుటుంబాలు నిరుద్యోగం పాలు కావటమేకాక, నాణ్యానికి, మన్నికకు పేరుపడిన ఒక ప్రాచీన వృత్తి నశించే ప్రమాదంకూడా ఉన్నది.

ఈ దృష్టితోనే ద్వితీయ ప్రణాళికకాలంలో, ప్రభుత్వం సంవత్సరానికి 70 కోట్ల గజాల వస్త్రాన్ని చేనేత రంగానికి కేటాయించింది. మిల్లుబట్టపై సెస్సును విధించి, ఆ సెస్సులో కొంత భాగాన్ని చేనేత పరిశ్రమాభివృద్ధికి వినియోగిస్తున్నది. గ్రాంటులు, అప్పుల రూపంలోను, వస్త్రాల కొనుగోలుపై రిబేటు రూపంలోను, పెద్ద మొత్తంలో ధనసహాయం చేస్తున్నది. 1956-'57 సంవత్సరంలో ఒక్క ఆంధ్రరాష్ట్రానికే పైవిధంగా సుమారు 55 లక్షల పైచిలుకు ధనాన్ని ఇచ్చింది.

కాని ప్రభుత్వం నేత పరిశ్రమకు చేస్తున్న సహాయం, ఫలితంగా పరిశ్రమలుగాని, కార్మికులుగాని తగినంత ప్రయోజనం పొందటం లేదు. చేనేత సహకార సంఘాల నిర్వహణలో జరుగుతున్న దుబారా, మోసం నిరంకుశ పద్ధతులే ఇందుకు ముఖ్య కారణం.

చేనేత సప్తాహ సందర్భంలో హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తూ కార్మికమంత్రి సంజీవయ్యగారు, చేనేత పరిశ్రమకు కేంద్రంచేసే సహాయంలో ఎక్కువభాగం దళారీలకే దక్కుతున్నదన్నారు. ఈ లాభం నేరుగా చేనేతకార్మికుల కందేటట్లు ఒక పథకాన్ని తయారు చేయాలన్నారు.

ఆంధ్రలో మొత్తం 5 లక్షల మంది చేనేత కార్మికులున్నట్లు అంచనా. వీరిలో సగంమంది మాత్రమే చేనేత సహకార సంఘాలలో సభ్యులుగా చేరారు. రాష్ట్రంలోని చేనేత సహకార సంఘంలో పెత్తనం వహిస్తున్న వర్గం, తమకు వ్యతిరేకులైన వారిని సంఘాలలో చేర్చుకోకుండా ఆటంకాలను సృష్టించడం వలననే ఈ పరిస్థితి ఏర్పడ్డది.

పోనీ సహకార సంఘాలలో చేరిన కార్మికులకైనా ప్రభుత్వం చేస్తున్న సహాయం పూర్తిగా లభిస్తున్నదా అంటే అదీ లేదు. సహకార సంఘంలో చేరిన నేత కార్మికునికి నూలును చౌకగా సప్లైచేయడం, అతను తయారుచేసిన వస్త్రాన్ని కొని ప్రభుత్వ ఎంపోరియంలో అమ్మించడం — ఈ రెండు సౌకర్యాలను రాష్ట్ర సంఘం కలిగించాలి. దాని ఆచరణలో రాష్ట్రసంఘం వారు ప్రాథమిక సంఘానికి నూలును ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ప్రాథమిక సంఘంలో తయారైన వస్త్రాన్ని విడుదల చేసే బాధ్యత తీసుకోవటం లేదు. కొన్ని సందర్భాలలో అసలు నూలును సప్లై చేయకుండానే, దొంగలెక్కలు తయారుచేయటంకూడా లేకపోలేదు. ఫలితంగా ప్రభుత్వం వివిధ రూపాలలో చేనేత పరిశ్రమకు చేస్తున్న సహాయంలో ఎక్కువ భాగం, దళారీలకు దక్కుతున్నది. సాధారణ చేనేత కార్మికుడు సంవత్సరం పొడుగునా పని లేక, పని ఉన్న రోజులలో కూడ రోజుకు రూపాయి కంటె ఎక్కువ గిట్టుబాటు కాక నానాఅవస్థలు పడుతుంటే, దళారీలు ప్రభుత్వ సహాయాన్ని దుర్వినియోగం చేసుకొని, లక్షలార్జించిన ఉదంతాలున్నాయి.

కనుక చేనేత పరిశ్రమకు నిజంగా రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి ఉద్దేశముంటే, రాష్ట్ర సహకార సంఘాల నిర్వహణలో ప్రజాస్వామిక మార్పులను ప్రవేశపెట్టాలి. రాజకీయ, వర్గ, పక్షపాతాలు లేకుండా అందరు చేనేత కార్మికులకు సహకార సంఘాలలో సభ్యత్వాన్ని కల్పించాలి. సహకార సంఘాల ఏర్పాటు విషయమై ప్రస్తుతమున్న కఠినమైన షరతులను సడలించాలి.

దీంతోపాటు చేనేత పరిశ్రమ రక్షణకు మరి కొన్ని చర్యలను కూడా ప్రభుత్వం తీసుకోవలసి ఉంటుంది.

చీరెలను, ధోవతులను నేత రంగానికే కేటాయించాలని చాలాకాలంగా చేనేత కార్మికులు ఆందోళన చేస్తున్నారు. అలాగే విదేశాలలో మంచి గిరాకీలో ఉన్న చేనేత వస్త్రాల ఎగుమతికి, ముఖ్యంగా లుంగీల ఎగుమతులకు ప్రభుత్వం మరి కొన్ని సౌకర్యాలు కలిగించాలి.

ఆంధ్రలో చీరాలలో ఒక సహకార నూలు మిల్లును ఏర్పరచటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చేనేత పరిశ్రమలో శిక్షణ యిచ్చే కేంద్ర సంస్థ ఒకటికూడా ఆంధ్రలో లేదు. అట్టి కేంద్ర సంస్థ నొకదానిని ఏర్పరచాలి. చేనేత సహకార సంఘాలకు ధన సహాయం చేసేందుకు ఒక ప్రత్యేక సంస్థనుకూడా ఏర్పరచాలి.

చేనేత పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం పైవిధమైన సహాయాలు చేయడంతోపాటు, తాము చేస్తున్న సహాయం అంతా సాధారణ నేత కార్మికునికి అందుతున్నదా లేదా అనే విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కొద్దిమంది దళారులు, ప్రభుత్వ అనుకూలవర్గాలు ప్రభుత్వ సౌకర్యాలన్నిటినీ తమ స్వార్థ ప్రయోజనాలకై వినియోగించుకోకుండా అరికట్టవలసివుంది.

* * *

'చీరలు, ధోవతులు చేనేతకు ఇవ్వాలి'

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీస్పీకర్ శ్రీ కొండా లక్ష్మణ్ అభిప్రాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 7

చేనేత పరిశ్రమ అభివృద్ధి చెంది, చేనేత పారిశ్రామికుల జీవన పరిస్థితులు చక్కబడాలంటే చీరెలు, ధోవతుల ఉత్పత్తిని చేనేతకు కేటాయించడమే ఏకైక మార్గమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ శ్రీ కొండా లక్ష్మణ్ చేనేత సప్తాహ దినోత్సవ సందర్భంలో పంపిన సందేశంలో పేర్కొన్నారు.

మొదట ఈ సూచనను చేనేత పారిశ్రామికులు కోరారని, అయితే దానిని కొందరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించలేదని చెప్పారు. కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి చేనేతకు చీరెలు, ధోవతులు కేటాయించడంవల్ల ప్రయోజనం వుండదని, ధనసహాయంతో చేనేత పారిశ్రామికుల పరిస్థితులను చక్కబరచవచ్చునని అభిప్రాయ పడ్డారు. మిల్లు వస్త్రాలపై సెస్సు విధించడానికి ఒక భాగాన్ని ప్రవేశపెట్టి, ఆ సెస్సు వసూళ్ళలో కొంత భాగాన్ని చేనేత పరిశ్రమాభివృద్ధికోసం ఖర్చు పెడుతున్నారు. సెస్సు ప్రణాళికను ప్రారంభించి ఐదు సంవత్సరాలైనా చేనేత పారిశ్రామికుల జీవన పరిస్థితులు చక్కబడలేదు. వారికి సంవత్సరం పొడుగునా పనిలేదు సరికదా, పనివున్నప్పుడు కూడ జీవనవృత్తికి సరిపడ ఆదాయం లభించడం లేదని శ్రీ లక్ష్మణ్ అన్నారు.

అంతరిక్షంలో సూక్ష్మజీవుల స్థితి

అవి మానవ శరీరంలో పనిచేసే పద్ధతిపై

రష్యన్ శాస్త్రజ్ఞుల వివరణ

మాస్కో, ఫిబ్రవరి 8

సోవియట్ స్పుత్నిక్కులను వదలడంవల్ల లభించిన శాస్త్రవిజ్ఞాన వివరాలు, మానవుడు అంతరిక్షాన్ని జయించడానికి సంబంధించిన అనేక జీవశాస్త్ర విజ్ఞానసమస్యలను పైకి తెచ్చాయి. తొలి ఆకాశనౌక, భూమి వాతావరణపు హద్దులనుదాటి మనుషులను తీసుకువెళ్ళడానికి ముందుగా యీ సమస్యలు చాలవరకు పరిష్కరించబడాలి.

ఒకవేపు శాస్త్రవిజ్ఞాన పరిశోధనలు జరుగుతుండగానే, దురదృష్టవశాత్తూ యింకొకవేపు అనేక నిరాధారమైన అభిప్రాయాలుకూడా వ్యక్తంచేయబడుతున్నాయి. శరీరంలో వుండే వైరస్‌లూ, సూక్ష్మక్రిములూ వ్యాధులను ఉత్పత్తిచేయడంవల్ల భావి అంతరిక్ష ప్రయాణీకులు చనిపోతారని కొన్ని అమెరికన్ పత్రికలు వ్రాశాయి.

ఈ విషయమై తమఅభిప్రాయాలు తెల్పవలసిందని టాస్ విలేఖరి వైరాలజిస్ట్ ప్రొఫెసర్ విక్టర్ జడనోవ్, మైక్రోబయాలజిస్ట్ ప్రొఫెసర్ అలెగ్జాండర్ ఇమ్‌షెనెట్స్కీ అనే యిద్దరు ప్రసిద్ధ సోవియట్ ప్రవీణులను కోరారు. వారి అభిప్రాయాలిదిగువనిస్తున్నాం.

వైరస్‌లు (రోగ సంబంధమైన విషపు ద్రవాలు) ఆరోగ్యవంతుల శరీరాలలోకూడా వుంటాయి. వివిధ కారణాలవల్ల మానవశరీరం బలహీనం కాగానే ప్రచ్ఛన్నంగా వుండే యీ వైరస్‌లు వ్యాధులను కలిగిస్తాయి.

ఉదాహరణకు, పెదిమల చర్మ వ్యాధులకు సంబంధించిన వైరస్‌లు అనేకమంది ఆరోగ్యవంతుల శరీరాలలో వుంటాయి. అవి నోటిలోని మ్యూకస్ మెమ్‌బ్రేన్ మీద కనబడకుండా వుంటాయి.

కాని యీ పొర, మలేరియా, ఇన్‌ఫ్లుయెంజా, నిమోనియా మొదలైన జబ్బులవల్ల బలహీనం కాగానే యీ వైరస్ పెదిమల మీద, ముక్కు రంధ్రాలలోనూ రసితో కూడిన చిన్న చిన్న కాయలను లేవదీస్తుంది. కొద్ది రోజులయాక అవి మానిపోయి మామూలుగా మళ్లీ వైరస్ దాని స్థానంలో ప్రచ్ఛన్నంగా వుంటుంది.

అంతరిక్షంలో, యీ ప్రచ్ఛన్న వైరస్‌లు ఎలా పనిచేస్తాయి? మానవ శరీరాన్ని వదిలి పైకివస్తే అవి అతి స్వల్పకాలంలో నశిస్తాయి. సూర్య కిరణాలవల్లముఖ్యంగా అల్ట్రావైలెట్ కిరణాలవల్లనూ, యితర వ్యాప్తి కిరణాల వల్లనూ వాటి పనికి దెబ్బతగులుతుంది.

అంతరిక్ష ప్రయాణీకుల శరీరాలలో వైరస్‌లు వ్యాధులను కలిగించగలవా? ఇది అసాధ్యం; భూమి మీద వుండేటప్పుడు అవి మామూలుగా కలిగించేకంటే ఎక్కువ తరచుగా వ్యాధులను కలిగించలేవు. అంతరిక్ష ప్రయాణీకులకు భూమి మీదవుండే మామూలుజీవనపరిస్థితులే కల్పించబడతాయి. వారి శరీరాలు అంతరిక్షపు ప్రమాదకర కిరణ ప్రసారాలనుండి రక్షించబడతాయి. అంతరిక్షనౌకలోని వాతావరణం మనిషి అలవాటుపడిన వాతావరణం లాగానే వుంటుంది, తినడం, ఊపిరిపీల్చడం అంతా మామూలుగానే వుంటుంది. ఇదంతా సాధ్యమేనని తొలి అంతరిక్ష ప్రయాణీకుడైన "లైకా"తో జరిపిన ప్రయోగంవల్ల తెల్లడైంది.

అయితే, భూమిమీద మానవ శరీరంలో వైరస్‌లు పనిచేసే రీతికి భిన్నంగా అంతరిక్ష ప్రయాణీకుల శరీరాలలో పనిచేస్తాయని విశ్వసించడానికి కారణా లేమిటి? అటువంటి అభిప్రాయం కేవలం ఊహాజనితమే కాని శాస్త్రవిజ్ఞానంమీద ఆధారపడినది కాదు.

అంతరిక్షంలో సూక్ష్మక్రిములు

సూక్ష్మక్రిములు స్పుత్నిక్‌లోనికి గాని, ఏదైనా ఇతర గ్రహంలోనికి గాని ప్రవేశించినట్లయితే ఏమి జరుగుతుందో తెలుసుకోవడం ఆసక్తికరంగా వుంటుంది.

సుమారు మైలున్నర లోతున భూగర్భంలో నూనెతో కలిసివుండే నీటిలోనూ, గాలిలో ఎగిరివెళ్ళి వాతావరణపు పైపొరలలోనూ (స్ట్రాటోస్ఫియర్‌లో)కూడా సూక్ష్మ క్రిములుంటాయి. చాలఎత్తున ఆకాశంలో పరిస్థితులు సూక్ష్మక్రిముల మనుగడకు ప్రతికూలంగా వుంటాయి; ఎందుకంటే అక్కడి సూర్య, విశ్వ కిరణాలప్రభావం ఎక్కువగావుంటుంది.

అయితే రాకెట్‌లోగాని, యింకేదైనా అంతరిక్ష నౌకలోగాని వుండే సూక్ష్మ క్రిములు యీ హానికరమైన ప్రభావాలకు గురికాకుండా సురక్షితంగా యింకొక గ్రహాన్ని చేరుకోగలవు. అయితే ఆ విధంగా "ప్రాణులు ఎగుమతి"అయ్యే అవకాశమున్నది భూమిమీద జీవాణుల వుత్పత్తిని గురించిన సైద్ధాంతిక సమస్యా పరిష్కారానికి దారిచూపదు. అంతరిక్ష మండలం నుండి సూక్ష్మక్రిములు వచ్చి పడడంవల్ల భూమి మీద జీవాణువులు ఉత్పత్తిఅయేయనే భావాన్ని ఆధునిక శాస్త్రవిజ్ఞానం అంగీకరించదు. జీవరహితపదార్థంలో దీర్ఘ పరిణామంవల్ల సజీవ పదార్థం ఏర్పడింది. ఆధునిక రసాయనిక శాస్త్రజ్ఞులు ఏమినో ఏసిడ్‌లూ ప్రోటీన్‌ల సంయోగంపై జరిపిన కృషి యీ భావం సరియైనదని ధృవపరచింది.

కాబట్టి అంతర్గ్రహ ప్రయాణంవల్ల సూక్ష్మక్రిముల ఎగుమతి సుసాధ్యం. వాటిలో వ్యాధులను జనింపజేయగల సూక్ష్మక్రిములున్నట్లయితే వాటి భావి మనుగడ, అవి వెళ్ళే గ్రహంమీద ఎలాంటి జీవరాసి అయినా వుండడం, లేకపోవడం అనే విషయంపై ఆధారపడి వుంటుంది. అక్కడ జీవరాసి లేకపోతే సూక్ష్మక్రిములు మరణిస్తాయి; లేదా, కొత్త పరిస్థితులకు అలవాటుపడి రోగాలను కలిగించేశక్తిని కోల్పోతాయి.

సూక్ష్మక్రిములు వివిధ బాహ్య ప్రభావాలకు మొక్కలకంటే, జంతువులకంటే ఎక్కువగా తట్టుకోగలవన్నది చాలముఖ్య విషయం. ఉష్ణరక్తపు జంతువులు మరణించగల పరిస్థితులలో సూక్ష్మక్రిములు జీవించగలవు. అయితే యీ కొత్త జీవన పరిస్థితులవల్ల క్రిముల లక్షణాలలో మార్పులు కలుగుతాయి. ఉదాహరణకు ప్రసరణశక్తి ప్రభావంవల్లగాని, ఉష్ణోగ్రతలో మార్పులవల్లగాని సూక్ష్మక్రిములు మార్పు చెందవచ్చును.

స్పుత్నిక్కులలో లేదా అంతర్గ్రహ రాకెట్లలో సూక్ష్మక్రిములకు ఎలాంటి పరిస్థితులుంటాయో అలాంటి వాటిని ఈనాడు లేబొరేటరీలలో సృష్టించవచ్చును. సీలు చేయబడిన స్పుత్నిక్‌లో సూక్ష్మక్రిములుస్థిరంగా సురక్షితంగా ప్రయాణం చేయగలవని అలాంటిపరిశోధనలవల్ల విశ్వసించడానికి వీలుకలుగుతూంది.

75 మైళ్ళ ఎత్తునుండి తీసిన భూమి ఛాయాచిత్రం

ఆకాశంలోకి, 75 మైళ్ళ ఎత్తుకు వెళ్ళిన ఒక సోవియట్ రాకెట్‌లో అమర్చబడిన ఒక ఆటోమేటిక్ కెమెరా భూమిని ఫొటో తీసింది. ఈ ఫొటోగ్రాపు "సోవియట్ రష్యా" అనే పత్రికలో ప్రచురించబడింది. ఫొటోలో భూమి ఉపరితలమూ, దిగంతపువంపూ కనిపిస్తాయి.

వాతావరణ పైపొరలను పరిశీలించడానికి రాకెట్ బయలుదేరడం, ఎగరడం, ప్రత్యేక పేరచ్యూట్ల సాయంతో రాకెట్ శీర్షం నేలకుదిగడం మొదలైన ఫొటోలుకూడా ఈ పత్రికలో ప్రచురించబడ్డాయి.

భూపదార్థ విజ్ఞాన సంవత్సర కార్యక్రమాన్ననుసరించి సోవియట్ దేశంలో అటువంటి రాకెట్లు 125 విడిచిపెట్టబడతాయి. చాల రాకెట్లు అప్పుడే 125 మైళ్ళ ఎత్తుకు వెళ్లేయి. చాల ఎత్తున ఆకాశంలో గాలి వొత్తిడి, ఉష్ణోగ్రత తదితర వివరాలను సేకరించడానికి తగు పరికరాలు రాకెట్లలో వుంటాయి. ఒక నిర్ణీతమైన ఎత్తుకు వెళ్లేక యీరాకెట్లు రెండు భాగాలై పరికరాలుండే శీర్షమూ, శరీరమూ వేర్వేరుగా పేరాచ్యూట్ల సాయంతో క్రిందికి పడిపోతాయి.

రాకెట్లసాయంతో వైద్య, జీవశాస్త్ర పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. ఉదాహరణకు, 'అల్బినా' అనే కుక్క రెండుసార్లు ఆకాశంలోకి వెళ్లి రెండుసార్లూ 125 మైళ్ల ఎత్తు నుండి పేరాచ్యూట్ల సాయంతో క్రిందికి దిగివచ్చింది. రాకెట్లలో తిన్నగా చాల ఎత్తులకు వెళ్లడంవల్ల జంతువులకు బాధాకరం కాదనీ, కాబట్టి మనుషులుకూడా ఆ విధంగా రాకెట్లలో వెళ్లివచ్చుననీ పరిశోధనలవల్ల రుజువైంది. — (టాస్)

ప్రతి రైతుకు పట్టాదారు ప్యాసుబుక్కు ఇవ్వాలి

గ్రామోద్యోగుల విచారణ కమిటీ సూచన

[విశాలాంధ్ర విలేఖరి]

హైదరాబాదు, ఫిబ్రవరి 8

సర్వేనంబరు, శిస్తు, విస్తీర్ణం, మొదలగు వివరాలు గల "పట్టాదారు ప్యాసుబుక్కు" నొకదాన్ని ప్రతి రైతుకూ ఇచ్చే ఏర్పాటు చేయటం అవసరమని గ్రామోద్యోగుల విచారణ కమిటీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో సూచించింది.

రైతులకు 18వ నంబరుఫారంలో శిస్తు రసీదు తయారుచేసి ఇవ్వడం అసాధ్యమనీ అందువల్ల, పాత ఫారంలోనే శిస్తు రసీదిచ్చి పైవిధమైన ప్యాసుబుక్కును ఇస్తే అటు రైతులకు సంతృప్తి కలుగుతుంది, ఇటు గ్రామోద్యోగులకు పనిభారం తగ్గుతుందని కమిటీ అభిప్రాయపడింది.

కాలికో బైండింగు గల ఈ పాసుబుక్కు ఖరీదు రు 1/- పెట్టి, సగం మొత్తం ప్రభుత్వం తీసుకొని, ఇందులో వివరాలను నమోదుచేసే కరణానికి సగం ఇవ్వాలన్నారు.

ఆయా పట్టాదార్ల స్వాధీనంలో ఉన్న భూముల వివరాలను తెల్పే ఈ ప్యాసుబుక్కులలో, ఎప్పటికప్పుడు జరిగేమార్పులను (అంటే ఆభూములను పట్టాదారు మరొకరికి అమ్మడమో లేక కొత్తభూములను కొనడమో మొదలగునవి) నమోదు చేసే బాధ్యతనుకూడ ప్రభుత్వం కరణాలపై ఉంచాలని కమిటీ సూచించింది.

పట్టాలకు సంబంధించి, కమిటి చేసిన మరొక ముఖ్యసూచన జాయింటుపట్టాలను విడగొట్టి ఎవరిభూములను వారికి వేరువేరుగా పట్టాచేయడం, జాయింటు పట్టాలవల్ల ఒప్పందప్రకారం రైతులకు ఎన్నో యిబ్బందులు కలుగుతున్నవి. మొదటిది జాయింటు పట్టాదార్లలో ఎవరినుండైనా సరే యీ వస్తు భూమిశిస్తును రాబట్టవచ్చు. అందువల్ల గ్రామోద్యోగులు రైతులను మోసగించటానికి వీలున్నది. రెండు, జాయింటు పట్టాదారులంతా అనుమతి ఇవ్వనిదే ఆ భూములలో తన భాగాన్ని [illegible] తాకట్టు పెట్టడానికి వీలులేదు. [illegible] జాయింటుపట్టాల్లో [illegible] సేద్యకులకు [illegible] లభ్యంకావడంలేదు.

వీటన్నిటిదృష్ట్యా, నిర్బంధంగానైనా సరే, ప్రభుత్వం, జాయింటు పట్టాలను విడగొట్టాలని కమిటీ అభిప్రాయపడింది. దీనికై ప్రత్యేక [illegible] అవసరం లేదని, కరణాలకే ఈ పని అప్పజెప్పాలనీ కమిటీ సూచించింది. ఈ పని త్వరగా జరగడానికి కొన్ని సూచనలను చేస్తూ ఇకమీదట సబ్ రిజిస్ట్రారు ఆఫీసులలో రైతుల భూముల క్రయవిక్రయాదులకు సంబంధించిన పత్రాలు హాజరుపరిచేటప్పుడు, ఆ భూముల పూర్తి సర్వే నంబర్లు లేకపోతే, రిజిస్ట్రేషన్ ఫీజుతోసహా సబ్ డివిజన్ ఫీజు కూడ వసూలు చేసే ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. ఇందువల్ల, చేతులు మారే భూములు ఎప్పటికప్పుడు సబ్ డివిజనయి వేరు వేరుపట్టాల క్రింద నమోదవుతాయి.

గ్రామోద్యోగుల పనిభారం తగ్గించే సూచనలు

గ్రామోద్యోగుల యొక్క, ముఖ్యంగా, కరణాల పనిభారం తగ్గించే సూచనలు కమిటీ, చాలా చేసింది. వీటిలో ముఖ్యమయినవి ఇవి.

ప్రస్తుతం కరణాలు ప్రతిసంవత్సరం అడంగలుఅనే చాటభారతమంతపుస్తకం ఒకటి వ్రాయాలి. ఇది ఏటేటా వ్రాయడం అనవసరం, కొద్ది మార్పులతో 5 సంవత్సరాల కొకసారి వ్రాస్తే పనితగ్గి, ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది.

మాస్వారీ లెక్కలలో సర్వే నెంబర్లు మొదలగు వివరాలు వేయడం అనవసరం. విస్తీర్ణం వేస్తే చాలు, 2 ఎ. లో స్కెచ్‌లు వేయడంకూడ అవసరం లేదు. 2 సి ని ఏటేటా వ్రాయ పనిలేదు. దీనిని శాశ్వత రిజిస్టరుగా మార్చవచ్చు. 2 ఇ ని రద్దు చేయాలి. 4వ నంబరు అకౌంటును శాశ్వత రిజిస్టరుగా మార్చవచ్చు. 16వ నంబరు అకౌంటును ఖజానాలో శిస్తు చెల్లింపుతోపాటు తాలూకా ఆఫీసుకు పంపడం అనవసరం. నెలకొక పర్యాయం పంపితే చాలు. ఇంకా ఇలాటి సూచనలు చాలా చేశారు. పోతే జమాబంది పద్ధతిని యథాతథంగా వుంచాలని కమిటీ అభిప్రాయపడింది. జమాబందీకై వచ్చే గ్రామోద్యోగులను రోజుల తరబడి తాలూకా ఆఫీసుల చుట్టూ తిప్పకూడదనీ, 7 రోజులకు మించి కరణాన్ని, రెండు రోజులకు మించి మునసబును తాలూకా కేంద్రంలోనిలుపరాదనీ సూచించింది.

సమావేశాల అలవాటును విసర్జించడానికి సమావేశం!

మాస్కో, ఫిబ్రవరి 8

చీటికీ మాటికీ సమావేశాలు జరుపుతూ ఎడతెగని చర్చలు సాగించే అలవాటును విసర్జించడం కోసం ఒక సమావేశం జరపవలసిందని తుర్క్‌మెనిస్తాన్ రవాణా మంత్రికి 'ప్రావ్దా' సలహా యిచ్చింది.

వోడ్కా పార్టీలమీద వోడ్కా పార్టీలు జరపడమే కాని, ఈ మంత్రిగారు ఏ ఒక్క విషయం పట్టించుకోవడమే లేదని 'ప్రావ్దా' విమర్శించింది.

తుర్క్‌మెనిస్తాన్ రవాణా శాఖ ఉద్యోగులలో ఒక్కరూ రాష్ట్రమంతా తిరిగిన పాపాన ఎన్నడూ పోలేదు. వారంతా రాజధాని అష్కాబాదులో సమావేశాలు జరిపి తుర్క్‌మెన్ పెర్షియా సరిహద్దును గురించి ఎడతెగని చర్చలు జరుపుతూ వుంటారు. రోజుకు ఎనిమిదిగంటలసేపు ఖచ్చితంగా చర్చల్లో కూర్చుంటారు. ఇలా అనేక రోజులపాటు చర్చలు సాగినా నిర్ణయమేదీ జరగదు. ప్రతిసమావేశానంతరమూ ప్రతినిధులంతా మంత్రి గౌరవార్థం జరిగే విందులో పాల్గొని ఆయన నభినందిస్తూ వోడ్కా ఆస్వాదిస్తారు. అందుకని ఈ రవాణాశాఖాధిపతులు ఈసమావేశాలన్నింటినీ అంతం చేసే ఒక సమావేశాన్ని జరపడం మంచిది అని 'ప్రావ్దా' పేర్కొంది.

రష్యా పార్లమెంటరీ ప్రతినిధివర్గం

ఫిబ్రవరి 14వ తేదీన భారతదేశానికి రాక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8

సోవియట్ పార్లమెంటరీ ప్రతినిధివర్గం ఫిబ్రవరి 14వ తేదీన ఢిల్లీ చేరుకుంటుంది. భారతదేశంలో వీరు మూడు వారాలు వుంటారు. వివిధ స్థలాలను సందర్శిస్తారు. ప్రతినిధివర్గంలో 14 మంది సభ్యులువుంటారు.

వీరు ఢిల్లీ, ఆగ్రా, జయపూర్, బొంబాయి, పూనా, ఔరంగాబాద్, బెంగుళూరు, మైసూరు, మద్రాసు, కలకత్తాలను, భాక్రానంగల్ ప్రాజెక్టు, భిలాయ్ ఉక్కు కర్మాగారాన్ని, సింద్రీ ఎరువుల ఫ్యాక్టరీని, చిత్తరంజన్ రైలు పెట్టెల కర్మాగారాన్ని సందర్శిస్తారు.

రాంచీవద్ద యురేనియం నిక్షేపాలు

కాన్పూరు, ఫిబ్రవరి 8

బీహారులో రాంచీవద్ద యురేనియం నిక్షేపాలు అపారంగా గలవనీ వాటిని తవ్వడానికి త్వరలోనే ఏర్పాట్లుచేస్తామని భారత అణుశక్తి కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ భాభా నేడిక్కడ వెల్లడించారు. అణుశక్తి ఉత్పాదకాలైన అనేక లోహాలు భారతదేశమంతటా దొరకగలవన్న విషయం భూగర్భ పరిశోధనల ద్వారా తేలిందని ఆయన అన్నారు.

పన్నెండవ భారత రేడియోలజీ మహాసభలో ఆయన ప్రసంగిస్తూ భారతదేశంలో అణుశక్తి శాంతియుత ప్రయోజనాలకు అపారావకాశాలు ఏర్పడ్డాయని చెప్పారు.

ఇంతవరకూ రేడియాలజిస్టులకు ఎక్స్‌రే, రేడియం అనే రెండేరెండు ఉపకరణాలున్నాయనీ, అణుశక్తిని పెంపొందించడం ద్వారా ఇంకా ఎన్నో ఉపకరణాలను వారికి అందించడానికి వీలున్నదనీ ఆయన అన్నారు.

రేడియో ధార్మిక గుణంగల ఐసొటోప్సు జీవశాస్త్ర వైద్యశాస్త్ర పరిశోధనల్లో విప్లవం కొని తెచ్చాయన్నారు.

ట్రాంబేలోని జీవశాస్త్రశాఖవారు ఎక్స్‌రేను ఉపయోగించి వరి త్వరగా పూతకు వచ్చేటట్లు చేయగలిగారన్నారు. రేడియో ధార్మికగుణంగల ఐసొటోప్సు ప్రయోగించి తెగుళ్ళను నివారించగలిగామన్నారు.

మాంసం, పాలు, పళ్లు, మున్నగువానిలో గల సూక్ష్మజీవులను ఈ రేడియో ధార్మిక రసాయనాలద్వారా సంహరించడంవల్ల అవిచలువపెట్టెల్లో పెట్టనక్కరలేకుండానే చాల కాలం వరకు తాజాగా వుంటున్నాయని చెప్పారు.

కూరగాయలు కుళ్ళిపోకుండాను, పళ్లు మాగిపోకుండాను ఈ పద్ధతివల్ల వుంచవచ్చునన్నారు. తిండికొరత వున్న మన దేశంలో ఈ పద్ధతులను బాగా పెంపొందిస్తే ఎంతో మేలు కలుగుతుందన్నారు.

1956 నుంచీ పని చేస్తున్న అప్సర (అణుశక్తి ఉత్పాదక యంత్రం పేరు) ద్వారా పరిమిత సంఖ్యలో ఐసొటోప్సులను ఉత్పత్తి చేస్తున్నారు.

అయితే వ్యవసాయంలోను జీవశాస్త్ర వైద్యశాస్త్రాలలోను యీ ఐసొటోప్సుల వినియోగం ప్రస్తుతం ప్రయోగదశలోనే వుండగలదన్నారు. కాగా దీన్ని తొందరలోనే దేశమంతటా ప్రచారంలోకి తేవాలని అణుశక్తి కమిషన్‌వారు యోచిస్తున్నారన్నారు.

మద్రాస్ శాసనసభా సమావేశం

మద్రాసు, ఫిబ్రవరి 8

మద్రాసు శాసనసభా సమావేశం నేడు ప్రారంభమైంది. ఉభయసభల సంయుక్త సమావేశంలో కొత్త గవర్నరు శ్రీవిష్ణురాం మేధీరాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని వివరిస్తూ ప్రసంగం చేశారు. రాష్ట్రభాషా వివాదం విషయంలో జాతీయైక్యతాదృష్టిని ప్రదర్శించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. భూములకు తాత్కాలిక గరిష్ఠపరిమితినినిర్ణయిస్తూ ప్రభుత్వం బిల్లు తేనున్నదనిచెప్పారు.

ఉత్తరాది వ్యక్తిని గవర్నరుగా నియమించినందుకు నిరసిస్తూ ద్రవిడ మున్నేట్రకజగం సభ్యులు 15 మంది ఈ సమావేశాన్ని నేడు బహిష్కరించారు.

భారతదేశం విదేశ మారకం పరిస్థితి

దిగుమతుల సలహాసమితి సమావేశంలో కేంద్రమంత్రి శ్రీ మొరార్జీదేశాయి ప్రసంగం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8

అమెరికా, సోవియట్ రష్యా, బ్రిటన్, పశ్చిమ జర్మనీ, జపాన్ వగైరా అనేక దేశాలనుండి సహాయంలభించినప్పటికీ భారత విదేశీమారక ద్రవ్య పరిస్థితి క్లిష్టంగా వుందని, మరి కొంతకాలం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ మొరార్జీ దేశాయ్ నేడిక్కడ చెప్పారు.

దిగుమతుల సలహాసమితి సమావేశంలో శ్రీ దేశాయ్ ఉపన్యసిస్తూ ద్వితీయ ప్రణాళిక ప్రధానభాగాన్ని పూర్తిచేయడానికై విదేశీమారకంలో తగినన్ని మొత్తాలు చెల్లించవలసి వున్నందువల్ల, దేశంలో పరిశ్రమలు నడవటానికి అవసరమైన ముడిపదార్థాలకు చాలా ఎక్కువమొత్తాలు ఖర్చు అవుతున్నందువల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.

ముడిపదార్థాలకోసం ఇదివరలో కేటాయించిన మొత్తాలు కూడ ఏమాత్రమూ చాలవనే వాస్తవాన్ని తాను గుర్తిస్తున్నానని చెప్పారు. కొరతలు ఏర్పడ్డాయని ఫిర్యాదులు వస్తే వీలైనంతవరకు వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. విదేశాలనుండి దిగుమతిచేసుకొనే ముడిపదార్థాల స్థానంలో దేశీయసరుకులను ఉపయోగించడానికి మార్గాలు వెదకాలని [illegible] విజ్ఞప్తి చేశారు.

ఆయన ఇంకా ఇలా చెప్పారు.

దిగుమతుల విషయంలో ఇప్పుడు ప్రభుత్వం తీసుకొన్న కట్టుదిట్టాలవల్ల ఫలితాలు అప్పుడే ప్రారంభమైనాయి. అయితే ఈ విధానంవల్ల పూర్తి ఫలితాలు నిజంగా ఈ సంవత్సరం ఉత్తరార్థంలో కనబడతాయి. స్టెర్లింగ్ నిల్వలు 1957 అక్టోబరు - డిసెంబరు మధ్యలో 55 కోట్లు తగ్గితే, అంతకు క్రితం మూడు నెలలలో 100 కోట్లు తగ్గిపోయాయి. 1958 సంవత్సరం మొదటి వారంలో తగ్గిపోయిన నిల్వలు 1957 అక్టోబరు - డిసెంబరు మధ్య కంటె కొంచె తక్కువే. ఈ మాత్రపు తగ్గుదలకూడ ఎంతోకాలం కొనసాగడానికి అనుమతించబడదు. మరోమాటలో చెప్పాలంటే పరిస్థితి మెరుగైంది. అయినప్పటికీ తీవ్రంగా వుంది. ఈ సంవత్సరం [illegible] (ఏప్రిల్ - సెప్టెంబరు)లో తగినన్ని ముడిపదార్థాలు అందివ్వడానికి ప్రభుత్వం తన శాయశక్తులా కృషిచేస్తుంది. అయినప్పటికీ పరిస్థితి క్లిష్టంగానే వుంటుంది. వ్యాపారస్థులు ఇప్పటి పరిస్థితిని అవకాశంగా తీసుకొని ధరలను పెంచివేయకూడదు. కొన్నివస్తువుల ధరలు పెరిగిపోయాయని విని నేను ఆందోళన చెందాను. ఆవస్తువుల కొరతలు నిజంగా ఏర్పడిందా అంటే లేదు. నిల్వలు వున్నవారు అధికలాభాలపై మాత్రమే అమ్మడానికి తమ సంసిద్ధతను తెలియచేశారు.

మనదేశం సమీప భవిష్యత్తులో విదేశాలనుండి దిగుమతి చేసుకోలేని వాడకంవస్తువులు అనేకం వున్నాయి. ముడిపదార్థాలు, నూతనఅభివృద్ధికి అవసరమైన పరికరాలలో ముడిపదార్థాల దిగుమతికి ఎక్కువ ప్రాధాన్యత [illegible]

గుంటూరు హిందూ కాలేజీ హైస్కూలు వార్షికోత్సవం

గుంటూరు, ఫిబ్రవరి 6

గుంటూరు హిందూ కాలేజీ హైస్కూలు 98 వ వార్షికోత్సవం జనవరి 31, ఫిబ్రవరి 1 తేదీలందు జరిగింది. తొలిరోజు సమావేశానికి గుంటూరు మునిసిపల్ చైర్మన్ శ్రీ నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావు గారధ్యక్షత వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ కె. స్థల హనుమంతరావుగారు స్వాగతం చెప్పారు.

చక్కగా నలంకరింపబడిన పాఠశాల మైదానంలో బాలబాలికల వ్యాయామ ప్రదర్శనలు, స్కౌటు, జూనియర్ రెడ్‌క్రాస్ ఎన్. సి. సి. పెరేడ్ మొన్నగునవి జరిగినవి.

కమిటీ అధ్యక్షులు శ్రీ వీకా ఆంజనేయులుగారు వ్యాయామ క్రీడలలో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులు పంచిపెట్టారు.

రెండవరోజు సభకు గుంటూరు రీజనల్ డిప్యూటీ డైరెక్టరు ఆఫ్ స్కూల్స్ శ్రీ టి. ఆర్. దీనదయాళుగారు అధ్యక్షత వహించారు. పాఠశాల బ్యాండుదళం సంగీతము సమర్పించింది. పాఠశాలా డ్రాయింగ్ టీచరు శ్రీ చిట్ర శ్రీనివాసరావుగారు చిత్రించిన తైలవర్ణ 'గీతోపదేశం' చిత్రాన్ని శ్రీ వీకా ఆంజనేయులుగారు ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల నివేదికను, స్టాఫ్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీ సన్నిధి శ్రీనివాసరావుగారు వార్షిక నివేదికను, కమిటీ కార్యదర్శి శ్రీ తూములూరి నాగభూషణంగారు పాలకవర్గ నివేదికను చదివారు. శ్రీ అన్నంరాజు సత్యనారాయణరావుగారిచే రచింపబడిన పాఠశాలాస్తుతిగేయం విద్యార్థి తెన్నేటి నరసింహారావుగారు గానం చేశారు.

విద్యార్థినులు సింహాద్రి, అశ్వని, బాలమణి, జానకి మున్నగువారు సంగీతం పాడగా విద్యార్థులు కస్తూరి సూర్యనారాయణ ఫ్లూటు, చింజమూరి శేషశ్రీనివాసాచార్య ఫిడేలు వాయించారు. శ్రీ లంకా సుబ్రహ్మణ్యంగారు హార్మోనియం వాయించారు.

కమిటీ అధ్యక్షులు శ్రీ వీకా ఆంజనేయులుగారు ప్రసంగించిన మీదట శ్రీమతి దీనదయాళుగారు బాలబాలికల విద్యా విషయక పోటీలలో గెల్పొందినవారికి బహుమతులు పంచిపెట్టారు.

పాఠశాల విద్యార్థులు విచిత్రవేషధారణ, ఇంగ్లీషు, తెలుగు నాటికలను ప్రదర్శించారు.

సినిమా పారిశ్రామిక సలహాసంఘం సభ

తిమ్మాపురం, ఫిబ్రవరి 7

ఆంధ్ర ప్రదేశ్ సినిమా పారిశ్రామిక సలహాసంఘ మహాసభ ఇటీవల లక్ష్మీ టూరింగ్ టాకీస్‌లో శ్రీ డి. సుభద్రరాజుగారి అధ్యక్షతను జరిగింది.

డాక్టరు జి రాజారావు ప్రభృతులు పంపిన సందేశాలు సభలో చదువబడ్డాయి. సంఘ చరిత్రను, ఆశయాలను డాక్టరు శ్రీ జి. కృష్ణమోహన్‌గారు వివరించారు.

సహకార పద్ధతిమీద చిత్రపరిశ్రమ నడవడానికై "సినిమా పనివారల సహకార సంఘాలు" స్థాపించడానికి, అందుకు అవసరమైన వాటాధనాన్ని వసూలుచేసి అకౌంట్ పెట్టి నిర్వహించడానికి డాక్టరు కృష్ణమోహన్‌కు అధికారమిస్తూ తీర్మానించారు.

హైదరాబాద్‌లో స్టూడియో నిర్మిస్తున్న సారథి స్టూడియోస్ వారిని అభినందిస్తూ, ఆసంస్థ వారికి అవసరమైన సాంకేతిక కళాకారులను, పాత్ర, ఉపపాత్రధారులను సప్లయిచేసే అధికారం ఈసంస్థకు ఇప్పించాలని తీర్మానించారు.

ఆంధ్ర హైకోర్టు అడ్వొకేటు జనరల్ శ్రీ దువ్వూరు నరసరాజుగారు గౌరవాధ్యక్షులుగా, డాక్టర్ కృష్ణమోహన్‌గారు కార్యదర్శిగా మరో 32 మందితో సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు.

వీరవాసం మైలర్ల సమావేశం

వీరవాసం, ఫిబ్రవరి 6

వీరవాసం పట్టణ మైలర్లు శ్రీ వీరవల్లి భీమన్నగారి అధ్యక్షతను సమావేశమై సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

శ్రీ గుబ్బల చిన్నబ్రహ్మయ్యగారు అధ్యక్షుడుగా, శ్రీ సద్దాల సత్యనారాయణమూర్తిగారు కార్యదర్శిగాను ఎన్నికైనారు.

కంభం, మార్కాపురం తాలూకాలలో పార్టీనిధి

రు 2148 లు వసూలు, రు 3847 లు వాగ్దానాలు

కంభం, ఫిబ్రవరి 7

కర్నూలుజిల్లా కంభం, మార్కాపురం తాలూకాల్లోని 20 గ్రామాల్లో కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు 1103 మందిని కలుసుకోగా పార్టీనిధికి రు. 3847/8 వాగ్దానం చేశారు. వీటిలో రు 2148/8 వసూలయాయి. ఈసందర్భంలో పార్టీ యంత్రాంగాన్ని కేంద్రీకరించి పనిచేసింది.

వివరాలు ఈ క్రిందివిధంగా వున్నాయి.

కంభం తాలూకా

గ్రామం	వాగ్దానాలు	వసూలు
కంభంటౌన్	రు 445	రు 318
కందులాపురం	206	206
కొమ్మునూరు	116	110
గిద్దలూరు	500	150
మక్తాపురం	15	10
తురిమెళ్ళ	350	—
కొళ్ళవీడు	125	50
ఆకవీడు	40	—
పుల్లలచెరువు	300	200
జయరాంపురం	116	200
మదాపపల్లె	20	—
మొత్తం	2233	1084

మార్కాపురం తాలూకా

	వాగ్దానాలు	వసూళ్లు
మార్కాపురం	రు.1400/-	850/-
పెద్దకొండ	116/-	116/-
వైపాలెం	38/-8	38/-8
దేవరాజుగట్టు	20/-	20/-
పెద్దనాగులవరం	40/-	40/-
మొత్తం	1614/8	1064/-8

మార్కాపురం పట్టణంలో లాయర్లు, డాక్టర్లుమొదలుకొని కూలీల వరకు అన్నివర్గాల ప్రజలను కలుసుకోగా పావులా మొదలు వంద రూపాయలవరకు వాగ్దానం చేశారు. మార్కాపురం తాలూకా మొత్తంలో 5 గ్రామాలనుండి 1614-8-0 వాగ్దానాలు, 1016-8-0 వసూళ్ళువచ్చాయి. ఒక్క మార్కాపురం పట్టణంలోనే రు 1400-0-0 వాగ్దానాలు రు 850 లు దాకా వసూలు అయినవి. పార్టీనిధి వసూళ్ళలోను, సభల నిర్వహణలోను మార్కాపురం పలకల పరిశ్రమల కార్మికులు ఆదర్శవంతమైన కృషి సల్పారు. దళాలుగా బయలుదేరి వారందినాలపాటు నిర్విరామ కృషి సల్పారు. వర్తకులు, లాయర్లు, మధ్యతరగతి ప్రజలు లేదనకుండా శక్తికొలది పార్టీకి ఆర్థిక సహకారం చేసినారు. మొత్తం 500 మంది కార్మికులు, 200 మంది సహృదయులనుంచి పై ఆర్థిక సహకారం లభ్యమైంది.

కంభం తాలూకాలో

కంభం తాలూకాలో మొత్తం రు 2200 లు వాగ్దానాలు రు 1084 వసూలు అయాయి. మొత్తం 14 గ్రామాల్లోని 403 మందివద్ద యీ మొత్తం లభ్యమైంది. ఈ తాలూకాలో రూపాయి మొదలు యాభై రూపాయల వరకు విరాళంగా ఇచ్చారు.

ఆముదాల వలసలో రు 305 లు వసూలు

శ్రీకాకుళంజిల్లా ఆముదాలవలస ప్రాంతంలో పార్టీనిధి వసూళ్ల కార్యక్రమం చురుకుగాజరుగుతోంది. ఆముదాలవలసలోనే రు 220 లు వసూలు అయాయి. బొడ్డపల్లిపేట రు 15/-, [illegible] రు 25/-, వెంకయ్యపేట 25/-, తిమ్మాపురం 20/- లు వసూలయాయి. [illegible] వలసలో రు 50/- లు వాగ్దానం చేశారు.

[illegible] రు. 500/- లు కంటె ఎక్కువ వసూలు చేయగలమని విశ్వాసంతో తాలూకాలో [illegible] కార్యకర్తలు కృషిచేస్తున్నారు. [illegible] ప్రాంతం. అన్ని [illegible] వ్యక్తులు, వర్తకులు [illegible] ప్రజానీకం అడుగగానే చేసేవరకుండా [illegible] పార్టీ నిధి [illegible] న్నారు.

మామిడిపల్లిలో

సోంపేటతాలూకా మామిడిపల్లి గ్రామసర్పంచ్ [illegible] మాసయ్య నాయుడుగారు తనకు పార్టీ బాకీపడ యున్న రు. 290/- లు విరాళంక్రింద జమకట్టారు. జనవరి నెలనుండి ప్రతి [illegible] 10/- [illegible] దానికి అంగీకరించారు. ఏరికి 4, 5 ఎకరాలు భూమి మాత్రమే వుంటుంది. ఈ సంవత్సరం పంట కూడా పోయింది. పార్టీ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి ఆదర్శంగా ముందుకు వచ్చారు.

నందిగామతాలూకాలో

నందిగామ తాలూకాలోని 5 గ్రామాల్లో తాలూకా కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆయాగ్రామాల్లోని పార్టీ సభ్యులు కలిసి మొత్తం రు 850 పార్టీనిధికి వాగ్దానాలు చేయించారు. రు. 465 లు వసూలు చేశారు.

కొణతమాత్మకూరు

తాలూకా పార్టీకార్యదర్శి శ్రీ పాటిబండ్ల కోదండరామయ్య, కమిటీ సభ్యులు శ్రీ [illegible] నాగేశ్వరరావు గ్రామాలలోని ముఖ్య కార్యకర్తలు కలసి కొణతమాత్మకూరులో 125 కుటుంబాల్ని కలుసుకొన్నారు. 5 బస్తాల జొన్నలు రు 45 లు నగదు వాగ్దానం చేశారు.

వీరులపాడు

వీరులపాడులో 40 కుటుంబాలలోని రైతు - కూలీలను కలుసుకోగా రు 116 లు ఒక బస్తా ధాన్యం యిచ్చారు.

సోమవరం

తాలూకా కమ్యూనిస్టు నాయకులు వాసిరెడ్డి రామారావు, నీమికొండ నాగేశ్వరరావు సోమవరం గ్రామంలోస్థానికముఖ్యులసాయంతో గ్రామంలోని 20 మంది రైతులనుండి 125 మానికల వడ్లు విరాళంగా వసూలుచేశారు.

కంచకచర్ల

గత మూడు సంవత్సరాలుగా పంటలు దెబ్బతింటూ వచ్చాయి. ఈ సంవత్సరంకూడా జొన్న పంట మాత్రంపండింది. అయినా 75 కుటుంబాలవారు 130 మానికలు జొన్నలు, రు. 72/- లు నగదు పార్టీ నిధికి ఇచ్చారు. గ్రామంలో ఇంకా కలుసుకోవాల్సిన ముఖ్యులు చాలామంది వున్నారు. మొత్తం రు. 300/- లు యిస్తామని వాగ్దానం చేశారు.

చెర్వుకొమ్ముపాలెం

చెర్వుకొమ్ముపాలెంలో వందకుటుంబాలవారు 9 బస్తాల జొన్నలు, రు. 33-8-0 నగదు పార్టీనిధికిచ్చారు. కూలీలు, రైతులు, కాంగ్రెసు అభిమానులైన రైతులు కూడ పార్టీకి జొన్నలు యిచ్చారు. ఆ విధంగా గ్రామంలో అంచనాలకు మించి రు. 300/- యిచ్చి పంపారు.

తాలూకా కమిటీ సమావేశంలో రు. 3000/-లు అంచనా వేసుకున్నపుడు ఎక్కువ అంచనా వేస్తున్నారని భావించాం. కాని ఆచరణలో కార్యకర్తలు కదిలి ప్రజల దగ్గరకు వెళ్ళినపుడు అంచనాలకు మించి వచ్చి పార్టీయెడల తమ అభిమానాన్ని చూపుతున్నారు. ఓపికగా కార్యకర్తలు కదిలితే 3 వేలు తాలూకాలో వసూలుకావడం సాధ్యమని స్పష్టమయింది.

మాదినపాడు బహిరంగసభలో

పల్నాడు తాలూకా మాదినపాడు గ్రామంలో గ్రామ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన జరిగిన బహిరంగసభలో రు 25/- లు పార్టీనిధి వసూలైంది. రు. 85 లు వాగ్దానాలు వచ్చాయి.

సభకు శ్రీ యం. నాగిరెడ్డిగారు యం. ఎల్. ఏ. అధ్యక్షత వహించారు. తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ [illegible] సుబ్బారెడ్డి, శ్రీ కె. పరబ్రహ్మం [illegible] గార్లు మాట్లాడారు.

మాచులూరులో

[illegible] కమ్యూనిస్టు నాయకులు శ్రీ [illegible] వి. కృష్ణారావు, తాలూకాకమిటీ సభ్యులు [illegible] శ్రీ జేయులపల్లి వెంకటేశ్వర్లు, [illegible] 2 వ సారి [illegible] గ్రామానికి వెళ్ళాము. మాచులూరు గ్రామంలోనే రు 1500/-లు వరకు వాగ్దానాలు వచ్చాయి. రు 345/- లు వసూలయ్యాయి. సిర్ల పల్లి దుబ్బిలో రు400/-లు, మాకినపల్లిలో రు.260/-లు వాగ్దానాలు వచ్చాయి. (క.)

విశ్వనాథపురం వైశ్యులపై కక్ష

గ్రామ మునసబు చర్యలు

కొలుకుల, ఫిబ్రవరి 6

మార్కాపురం తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యుడు శ్రీ ఎం. నాసర్ బేగ్ గారు ఇలా వ్రాస్తున్నారు:

మార్కాపురం తాలూకా విశ్వనాథపురం మైనర్ పంచాయితీ బోర్డు అధ్యక్షపదవిని తనకు రాకుండా చేశారనే కక్షతో గ్రామ మునసబు విశ్వనాథ పురం వైశ్యకుటుంబాలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

వైశ్య కుటుంబాలకు బట్టలు ఉతకకుండా, వారి పశువులను కాయకుండా, వారి వ్యవసాయానికి కూలీలను పోనీకుండా చేశాడు. వెల్లంపల్లె నుండి రౌడీలను పిలిపించుకుని, గ్రామమునసబు, అయనవర్గమూ వారిపైకూడ దౌర్జన్యానికి దిగారు. ఈ విషయాలు మార్కాపురం డిప్యూటీ కలెక్టరు, పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వగైరాలకు అర్జీలద్వారా తెలియజేయబడ్డాయి.

కార్మిక ప్రతినిధుల యెడ మంత్రి నిర్లక్ష్యం

గుంతకల్లు, ఫిబ్రవరి 7

ఆంధ్ర ప్రదేశ్ కార్మిక శాఖా మంత్రి శ్రీ డి. సంజీవయ్యగారు గుంతకల్‌కు వచ్చిన సందర్భంలో ఎ. సి. యస్. ఐ. ఎస్. ఐక్య కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ వీరన్నగారు కార్మికుల కోర్కెలను గురించి, మిల్లు అభివృద్ధినిగురించి కొన్ని సూచనలు చేస్తూ విజ్ఞప్తి పత్రాన్ని శ్రీ సంజీవయ్యగారికి సమర్పించారు.

మంత్రి తనను సాయంకాలం 3 గంటలలోపల ట్రావెలర్సు బంగళాలో కలుసుకోమన్నారు. సంఘ అధ్యక్షులు శ్రీ వి. కె. ఆదినారాయణ రెడ్డిగారి నాయకత్వాన దాదాపు 150 మంది కార్మికులు రాయబారం వెళ్ళారు. మంత్రి ట్రావెలర్సు బంగళాలోపలికి సంఘ అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులను పిలిపించి మాట్లాడకుండా కారులో వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. "మమ్ములను ఎందుకు పిలిపించాలి. మాట్లాడకుండా ఎందుకు వెళ్లిపోవాలి"అని ప్రతినిధులు మంత్రిని ప్రశ్నించితే, "పిలిపించాను" అని సమాధానం చెప్పి కారులో వెళ్లిపోయారు.

సత్తెనపల్లి అగ్రహారం రైతుల మహాసభ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1

జమీందారీ రైత్వారీప్రాంతాలలో అన్ని రకాల కండ్రీలు, శివాయ్ తదితర ఇనాములకుకూడ 1956 నాటి ఇనాం రైతుచట్టాన్ని వర్తింపజేయాలని ఇటీవల సత్తెనపల్లి తాలూకా హసాన్‌బాద్‌లో జరిగిన తాలూకా అగ్రహారం రైతులమహాసభలో తీర్మానించారు.

ఎట్టికాలహరణంలేకుండా సమగ్ర వ్యవసాయ సంస్కరణల చట్టం కోసం అన్ని రాజకీయ పార్టీలకు వెంటనే రైతాంగమూ ఐక్యంగా ఆందోళన చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ఏడు పెసరపైర్లు బాగా దెబ్బతిన్న బెల్లంకొండ, పెదకూరపాడు ఫిర్కాలకు ప్రభుత్వం తగు రక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ తీర్మానించారు.

అగ్రహారం రైతుల హక్కుల రక్షణకు ప్రభుత్వంతో సంప్రతింపులు జరిపే నిమిత్తం [illegible] ఒక కమిటీని నియమించారు.

ఈమహాసభకు శ్రీ పావులూరి గోపాల కృష్ణయ్యగారు అధ్యక్షత వహించారు. శ్రీ ఆరికెపూడి రామనాథం అడ్వొకేట్ శ్రీ మాగంటి వీరభద్రరావు, [illegible] రైతునాయకులు శ్రీ చలసాని వాసుదేవరావు ప్రభృతులు ఉపన్యసించారు.

ఆసియాజవుళి కార్మికుల ప్రధమ మహాసభ

కరాచీలో ఏప్రిల్‌లో

కోయంబత్తూరు, ఫిబ్రవరి 7

ఆసియా జవుళి కార్మికుల ప్రథమ [illegible] ఏప్రిల్ [illegible] జరుగుతుంది. మహాసభ [illegible] ఆసియా ప్రాంతీయ సంఘం [illegible] లలో [illegible] ప్రత్యక్షంగా [illegible] తున్నది. బ్రిటిషు [illegible] సభ్యుడు ఎర్నెస్టు థార్టన్ మహాసభ సన్నాహాలను జరిపే నిమిత్తం భారతదేశంలో పర్యటిస్తూ ఇక్కడకు వచ్చారు.

కమ్యూనిస్టుపార్టీని అణచాలన్న శక్తుల ఆటకట్టు

అల్లూరు బహిరంగ సభలో శ్రీ మాకినేని బసవపున్నయ్యగారి స్పష్టీకరణ

కోవూరు, ఫిబ్రవరి 5

కోవూరు తాలూకా కమ్యూనిస్టు పార్టీ సభ్యుల సమావేశం శ్రీ బస్వారెడ్డి శంకరయ్యగారి అధ్యక్షతన అల్లూరులో జరిగింది. 40 గ్రామాల నుండి 400 మంది సమావేశానికి వచ్చారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ మాకినేని బసవపున్నయ్యగారు జాతీయ,అంతర్జాతీయ పరిస్థితులను వివరించారు. భారతదేశంలో రెండోపంచవర్ష ప్రణాళికను బలపర్చాల్సిన అవసరాన్ని గురించి చెబుతూ ఈ ప్రణాళికను నీరు గార్చాలని ప్రయత్నిస్తున్న అభివృద్ధినిరోధకశక్తులు ప్రభుత్వంలోను, ప్రభుత్వ పార్టీలోను వున్నారని అందుకు వారు రకరకాల పన్నాగాలు పన్నుతున్నారని, కాబట్టి దేశాన్ని కొంతవరకైనా ముందుకు తీసుకు పోవాలంటే ప్రణాళిక జయప్రదం కావాలి. అందుకు మనపార్టీ ప్రముఖపాత్ర వహించాల్సివుంది అన్నారు. సోవియట్ రష్యాలో తమ పర్యటనానుభవాలను ముచ్చటించాక రాష్ట్ర రైతునాయకులు శ్రీ చలసాని వాసుదేవరావుగారు భూసంస్కరణలను గురించి తెలియజేశారు.

వివిధ తాలూకాలలో పార్టీనిధికి జరిగిన కృషిని జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ యల్లమందారెడ్డిగారు సమీక్షించారు. తర్వాత తాలూకాకమిటీ కార్యదర్శి శ్రీ జి. రామచంద్రయ్య తాలూకాలో పార్టీనిర్మాణం, తక్షణ కార్యక్రమంపై రిపోర్టుఇచ్చారు. సమావేశంలోచేసిన విజ్ఞప్తి ననుసరించి అప్పటికప్పుడు మొత్తం 64 మంది రు. 1380 లు పార్టీనిధికి ఇస్తామని వాగ్దానం చేశారు.

రాత్రికి 12 వేల మందితో జరిగిన బహిరంగసభకు స్థానిక పంచాయితీ బోర్డు అధ్యక్షులు శ్రీ లక్ష్మీనరసింహా చౌదరిగారు అధ్యక్షతవహించారు.

ఈ సభలో శ్రీ బసవపున్నయ్యగారు వుపన్యసిస్తూ, కమ్యూనిస్టు పార్టీ అవతరించినదాదిగా పార్టీని అణగద్రొక్కాలని చూచిన హిట్లరు, ముస్సోలినీ, టోజో మొదలగు వారంతా కాలగర్భంలో కలిసిపోయారని కమ్యూనిస్టుపార్టీ ప్రపంచంలోనే ఒక ప్రభావశక్తిగా రూపొందినదని స్పష్టంచేశారు.

ఇంత వరకు కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వంపై విమర్శచేసినా రష్యా, చైనాలలో ప్రజాస్వామ్యం లేదనీ, ప్రజలను అదిరించి, బెదిరించి అచట పనులు చేయిస్తారని మనది ప్రజాస్వామ్యదేశం కాబట్టి అలా చేయలేమనీ చెప్తూవుండేవారు. కాని కేరళలో ఇదే రాజ్యాంగంలో ప్రజలకు అనుకూలమైన ఇన్ని పనులు ఎలా చేయగలుగుచున్నారు? అని ప్రశ్నించారు.

కాంగ్రెసువారి మాటలకు-చేతలకు గల వ్యత్యాసాన్ని గమనించాలని పేదప్రజల హక్కుల కొరకు నిర్విరామ పోరాటం చేస్తున్న కమ్యూనిస్టుపార్టీకి అందరూ అన్ని విధాలా సహాయపడాలని విజ్ఞప్తి చేశారు.

ఆ తర్వాత చలసాని వాసుదేవరావుగారు భూసంస్కరణలు గురించి చెప్తూ ప్రభుత్వం అనుసరించుచున్న విధానంవల్ల పేదప్రజల క్షేమాత్రం వుపయోగపడకుండా పోతున్నదని గాబట్టి ప్రజలందరూ ఆందోళనచేసి మార్చి శాసనసభలో ప్రవేశపెట్టబోతున్న భూసంస్కరణల బిల్లు ప్రజానీకంయొక్క [illegible] మెరుగు పరచునట్లు యీ సమస్య [illegible] జరిగిన సంఘటనలు, అన్యాయాలు చెల్లవని ప్రకటించుటకు సభలు, సమావేశాలు జరిపి తీర్మానాలుచేసి, పెద్దఎత్తున ఆందోళనచేయాలన్నారు. కేరళ భూసంస్కరణల బిల్లు అన్ని రాష్ట్రాలకూ ఆదర్శప్రాయం కాగలదన్నారు.

[illegible] శ్రీ [illegible] రెడ్డి [illegible] భూసం[illegible] అనేకులు [illegible] ఇండ్ల [illegible] సేవలు [illegible] ఈ సంవత్సరం మంజూరు చేయాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాలు ఆమోదించడంతో సభ ముగిసింది.

[illegible] బాలికల దళంవారిచే,పున్నాటియుద్ధంబుర్రకథ చెప్పబడింది.

కంబాలపల్లిలో బహిరంగసభ

బయ్యవరం చెరువు సమీపంలోనున్న కొత్తగూడెం, కంబాలపల్లి, సర్దరేవు, కాసినపల్లె, మున్నగు గ్రామాల్లో శ్రీయుతులు టి. ఎల్. నరసింహారావు, టి. బి. విరలరావు, వెంపటల దలమయ్య, మంగపతిరావు, ఏలూరి లక్ష్మీనారాయణ గార్లు పర్యటించారు. గత నెల 26 వ తేదీన కంబాలపల్లిలో శ్రీ పాటి జగ్గయ్య గారి అధ్యక్షతను, 25 వ తేదీన మరో గ్రామంలో శ్రీ ఏలూరి రామనాథం గారి అధ్యక్షతను బహిరంగసభలు జరిపారు.

పై సభలన్నింటి తర్వాత శేషయ్య దళం 'కృషీవల' బుర్రకథ చెప్పింది.

లద్దునూరులో

వరంగల్‌జిల్లా జనగామ తాలూకా లద్దునూరులో ఈ నెల 2 వ తేదీన కమ్యూనిస్టుపార్టీ అధ్వర్యాన బహిరంగసభ జరిగింది. సభకు శ్రీ చల్ల నర్సిరెడ్డి అధ్యక్షత వహించారు. శాసన సభ్యులు శ్రీ జి. గోపాలరెడ్డిగారు, శ్రీ ఏ. నర్సింహారెడ్డి శ్రీ డి. నరహరిగార్లు ఉపన్యసించారు.

కంభం, మార్కాపురం తాలూకాల్లో బహిరంగసభలు

శ్రీ తరిమెల నాగిరెడ్డిగారి రాక సందర్భములో మార్కాపురం, కంభం, గిద్దలూరు పట్టణములలో కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యాన బహిరంగసభలు ఏర్పాటు చేయబడినవి. ఈ మూడు సభలకు దాదాపు 40 గ్రామాలనుండి దాదాపు 24 వేలు (మార్కాపురం 10 వేలు; కంభం 8 వేలు, గిద్దలూరు 6 వేలు) ప్రజలు హాజరైనారు. పై సభలలో శ్రీ టి. నాగిరెడ్డిగారు మాట్లాడారు.

బహిరంగ సభల అనంతరం శ్రీ ప్రసాద్ దళంవారు బుర్రకథ చెప్పారు.

పార్టీశాఖ కార్యదర్శుల సమావేశం

అల్లూరు, ఫిబ్రవరి 6

అల్లూరులో ఈ నెల 3 వ తేదీన కోవూరు తాలూకాలోని గ్రామపార్టీ శాఖాకార్యదర్శులసమావేశం శ్రీ పెండ్లి రమణయ్యగారి అధ్యక్షతను జరిగింది. పార్టీనిధి వసూళ్ళకు తాలూకాలో తీసుకోవలసిన తక్షణ కార్యక్రమం నిర్ణయించబడింది. షేక్ కాలేషా, ఎం. చిదంబరం, జి. రామచంద్రయ్య గార్ల నాయకులుగా 3 దళాలు ఏర్పరచి ఇప్పటినుంచీ ఇందుకు కృషి చేయాలని ఏ శాఖ కాశాఖ ప్రత్యేక చొరవతో ఈ కృషి సాగించాలని తీర్మానించబడింది.

గుంటూరు ఆస్పత్రి పనివారల సమావేశం

గుంటూరు, ఫిబ్రవరి 6

గుంటూరు జనరల్ ఆస్పత్రి పనివారి సర్వసభ్య సమావేశం శ్రీ రాజు నాగయ్యగారి అధ్యక్షతను జరిగింది.

కార్యదర్శి శ్రీ కనపర్తి ప్రసాదరావుగారు గత ఆరు నెలల కార్యకలాపాలపై నివేదిక ఇచ్చారు. ఎర్నాకుళంలో జరిగిన అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మహాసభ నిర్ణయాలను వివరించారు.

[illegible] ఆస్పత్రిలో [illegible] ప్రత్యేక నిపుణుడని [illegible] పొంది [illegible] అడ్మిటు [illegible] విరోధించారు. [illegible] సూపరింటెండెంట్ [illegible] సలహాను [illegible] పనిపోయింది. [illegible] సమావేశంలో [illegible] తీర్మానించారు.

పనివారల [illegible] ఒక వినతిపత్రం సమర్పించబడింది. దీనిపై ఇప్పుడైనా తగు శ్రద్ధతీసుకొని, పనివారలకు గృహవసతి [illegible] కోరారు.

గరివిడిలో కార్మికుల అరెస్టు

చీపురుపల్లి, ఫిబ్రవరి 5

గరివిడి ఫెర్రో ఫ్యాక్టరీ కొట్లాటను పురస్కరించుకొని నేటివరకు 15 మంది కార్మికులను అరెస్టుచేశారు. నాలుగు మైళ్ళ దూరానవున్న సబ్‌జైలులో వీరిని నిర్బంధించారు. వీరిపై చార్జిషీట్ పెట్టారు. ఈ కొట్లాటకు ముఖ్యకారకులైనవారి నెవరినీ అరెస్టు చేయలేదు.

కొట్లాటలతో సంబంధం వుందనే ఆరోపణపై ఈ కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడానికి యజమానులు ప్రయత్నిస్తున్నారు.

గుంటూరు ఛానల్ పథకం

వెంటనే అమలుపరచాలని కేంద్ర మంత్రికి వినతి

గుంటూరు, ఫిబ్రవరి 4

శాసనసభ్యుడు శ్రీ పి.వి. శివయ్యగారు నేడిక్కడ కేంద్ర విద్యుత్, నీటి వసరుల శాఖ ఉపమంత్రి శ్రీ కె. హాథీ, రాష్ట్ర మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు గార్లను కలుసుకొని గుంటూరు ఛానల్ పథకాన్ని వెంటనే అమలుపరచాలని కోరుతూ ఒక వినతి పత్రం సమర్పించారు. చుట్టుపట్ల గ్రామాల రైతులు అనేకమంది యీ సందర్భంలో హాజరయ్యారు.

ఒక వాయిదాలో అభివృద్ధిపన్ను ఇవ్వడానికి రైతులు సిద్ధపడితే ఈ పథకాన్ని వెంటనే అమలు జరిపిస్తామని, ఒకటిన్నర సంవత్సరంలో నీరు అందజేస్తామని రాష్ట్రమంత్రి శ్రీ నరసింగరావుగారు చెప్పారు. పథకాన్ని మంజూరుచేస్తే మూడు సంవత్సరముల వాయిదాలలో అభివృద్ధి పన్ను చెల్లించడానికి రైతులుతమ సంసిద్ధతను తెలియజేశారు.

అమలాపురం మోటారు కార్మిక సమావేశం

అమలాపురం, ఫిబ్రవరి 7

అమలాపురం మోటారు రవాణా కార్మికయూనియన్ సర్వసభ్య సమావేశం నిన్న జరిగింది. శ్రీ కలవకొల్లు ఆంజనేయులుగారు అధ్యక్షుడుగా, శ్రీ జి. వీరభద్రంగారు కార్యదర్శిగా కమిటీని ఎన్నుకొన్నారు.

"ప్రథమ చికిత్స" పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని కోరుతూ తీర్మానించారు.

సింగరాయకొండ

సింగరాయకొండ మోటారు కార్మిక సర్వసభ్య సమావేశం జిల్లా సంఘ అధ్యక్షుడు శ్రీ చిప్పుకుల నరసింహారావుగారి అధ్యక్షతను జరిగింది. 50 మంది ప్రతినిధులు హాజరైనారు.

సింగరాయకొండలో కందుకూరు డివిజన్ మోటారు కార్మికయూనియన్ స్థాపించడానికి నిర్ణయించారు.

శ్రీ బత్తుల శంకరరెడ్డిగారు గౌరవాధ్యక్షుడుగా పందొమ్మిది మందితో సంఘకార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

తెనాలి తాలూకా ఎన్. జి. వోల సభ

తెనాలి, ఫిబ్రవరి 5

తెనాలి తాలూకా ఎన్. జి. వోల సర్వసభ్య సమావేశం తెనాలిలో శ్రీ పి. వి. సుబ్బారావుగారి అధ్యక్షతను జరిగింది. శ్రీ పి. [illegible] గారు అధ్యక్షుడుగా, శ్రీ కే. [illegible] మూర్తిగారు కార్యదర్శిగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

ఎన్. జి. వో. [illegible] పోరాడే ఏకైకసంస్థ [illegible] బలపరచాలని [illegible] ఎన్. జి. వో. లకు [illegible] చేస్తూ ఒక తీర్మానం చేశారు.

కొల్లూరులో కౌలుదార్ల సంఘ స్థాపన

కొల్లూరు, ఫిబ్రవరి 7

తెనాలితాలూకా కొల్లూరులోని [illegible] సమావేశంలో శ్రీ మండవ [illegible] అధ్యక్షుడుగా, శ్రీ [illegible] వెంకటేశ్వర్లుగారు కార్యదర్శిగా [illegible] సంఘాన్ని స్థాపించారు.

కౌలుదారి ఆర్డినెన్సు వచ్చిన నాటికి సాగుచేస్తున్న కౌలుదార్ల జాబితాలను ప్రభుత్వం తయారుచేయించి, భూమి పంపిణీలో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ తీర్మానించారు.

విజయవాడ విశేషాలు

వివిధరాష్ట్రాల సాంఘిక సంక్షేమశాఖ అధ్యక్షుల రాక

అస్సాం, బీహార్, త్రిపుర, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన సాంఘిక సంక్షేమశాఖల అధ్యక్షులు శ్రీమతులు నీరాడోగ్రా, కళావతి త్రిపాఠి, సంఘమిత్రచటర్జీ, బినోదినీ సారంగి ఇటీవల కేరళ, మద్రాసు, మైసూరు, పాండిచ్చేరి, ఆంధ్రరాష్ట్రాలలో సాంఘిక సంక్షేమ వ్యవహారాలను పరిశీలిస్తూ 7 వ తేదీన విజయవాడ వచ్చి అగ్గిపెట్టెల పరిశ్రమను చూసి కలకత్తా వెళ్ళారు.

గన్నవరం తాలూకాలో ఎడ్ల పందెములు

గన్నవరం, ఫిబ్రవరి 6

గన్నవరం తాలూకా దేవలపల్లె వెంకటస్వామివారు ఉత్సవ సందర్భంలో ఇటీవల నిర్వహించిన బరువు లాగుడు పందెములలో [illegible] గ్రామ పంచాయితీబోర్డు అధ్యక్షులు శ్రీ వీరమాచినేని సర్వయ్యగారి రెండు ఎడ్లజతలు గెలిచాయి.

1360 పౌన్ల బరువుగల ఇసుక బస్తాలతో రెండు చక్రముల [illegible] 200 గజముల దూరాన్ని ఒక జత 3-50 సెకండ్లలలో లాగి మొదటి బహుమతి పొందింది. రెండవ జత ఇదే బరువును ఇంత దూరాన్ని 5 నిమిషాల్లో లాగి రెండవ బహుమతిని పొందింది.

చీరాల సహకార నూలు మిల్లు

శ్రీ కళా వెంకట్రావుగారిచే ప్రారంభోత్సవం

చీరాల, ఫిబ్రవరి 6

రెవెన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు చీరాల సహకార నూలు మిల్లుకు ప్రారంభోత్సవం చేశారు.

ఈసందర్భంలో పట్టణ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ మస్తాన్ గారు 600 మంది కార్మికులు సంతకాలు చేసిన ఒక మహజరును మంత్రికిఅందజేశారు. వైకుంఠపురం, శ్రీరామనగరం, విఠల్ నగరం, జయంతిపేట పోరంబోకుభూములలో పేదకార్మికులు పాతికేళ్లుగా నివసిస్తున్నారనీ వారికి ప్రభుత్వంఇంతవరకూ పట్టాలు ఇవ్వలేదనీ ఇప్పటికైనా పట్టాలు మంజూరుచేయాలని కోరారు.

వెంటనే పట్టాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని మంత్రి చెప్పారు.

లేఖలు

రుద్రవరంలో పాఠశాల

మహాశయా,

సత్తెనపల్లి తాలూకా రుద్రవరం గ్రామంలో 725 కు పైగా జనాభా యున్నది. బడి యీడుగల బాలబాలికలు 180 కు పైగా యున్నారు. దాదాపు 8 నెలల క్రితం ఈ గ్రామమునకు పాఠశాల కావలెనని చెప్పి సత్తెనపల్లి రేంజిస్కూళ్ళ డిప్యూటీ యిన్‌స్పెక్టరుగారికి అప్లికేషన్ పెట్టియున్నాము. [illegible] కమిటీ [illegible] చేయించినట్లు డిప్యూటీ యిన్‌స్పెక్టరుగారికి, రాజుపాలెం బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరుగారికి తెలియచేశాం. అనంతరం [illegible] యిస్తామన్నా, పాఠశాలకు, [illegible] ఆటస్థలమునకు [illegible] 50 సెంట్లభూమి [illegible] అంగీకరించాం. కాని అధికారులు ఇంత వరకు మా విజ్ఞప్తిని పాటించినట్లు లేదు. 300 మంది జనాభాయుండే [illegible] యివ్వవలెనని ప్రభుత్వ యుద్దేశం.

వీటన్నిటిదృష్ట్యా సాధ్యమగునంత త్వరలో మా గ్రామమునకు పాఠశాల యిప్పించి మేలు చేకూర్చవలసిందిగా సత్తెనపల్లి రేంజిస్కూళ్ళ డిప్యూటీ యిన్‌స్పెక్టరు, గుంటూరు పడమర (నర్సరావుపేట) డి. ఇ. ఓ., రాజుపాలెం బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరుగార్లను కోరుచున్నాము.

— [illegible] నారయ్య,

సభలుసమావేశాలు

[illegible] తాలూకా రిక్షా వర్కర్ల యూనియన్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 11 వ తేదీన [illegible] జరుగుతుంది.

చేనేత వారోత్సవం

విజయవాడలో ప్రారంభం

విజయవాడ, ఫిబ్రవరి 8

ఐదవ చేనేతసప్తాహం విజయవాడలో ఆంధ్రదేశ చేనేత సహకార సంఘంవారు గాంధీనగరంలో నిర్మించిన ప్రత్యేక పందిరిలో నేడు ప్రారంభమైంది. అధ్యక్షులు శ్రీ ఇనుమర్తి వీరభద్రరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తరువాత పురవీధుల గుండా ఊరేగింపు జరిగింది. సాయంత్రం శ్రీ కళా వెంకటరావుగారు సప్తాహాన్ని ప్రారంభించారు. శ్రీ వీరభద్రరావు సభికులకు స్వాగతం చెప్తూ ఇలా అన్నారు:

ఆంధ్రదేశ చేనేత సహకార సంఘానికి అనుబంధించబడిన ప్రాథమిక చేనేత సహకార సంఘాలు దాదాపు 685 వరకు ఉన్నవి. ఈ ప్రాథమికసంఘాలలో సుమారు లక్షా డెబ్బయివేలమంది చేనేత పారిశ్రామికులు సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రదేశ చేనేత సహకారసంఘం ముఖ్యమైన విధులు ఈవిధంగా ఉన్నాయి. ఎప్పటికప్పుడు మారే ప్రజాభిరుచులకు అనుగుణంగా శాస్త్రీయ ప్రమాణంతో కూడిన వస్త్రాలను ప్రాథమిక సహకార సంఘాలు ఉత్పత్తి చేయడానికి వీలుగా వాటికి నూలు సరఫరా చేయడం, అనుబంధ సంఘాలు ఉత్పత్తి చేసిన వస్త్రాలను తిరిగి వాటినుంచికొని, ఆంధ్రదేశ పరివ్యాప్తంగా వున్న తన విక్రయశాలల ద్వారా అమ్మించడం. ఈ సంఘానికి అనుబంధించబడి వున్న ప్రాథమిక సంఘాలు నెలకు దాదాపు ముప్పది లక్షల రూపాయల విలువగల వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నవి. ఇందులో సుమారు సగభాగం వస్త్రాలను తన ఆధీనంలో ఉన్న రెండు వందల విక్రయశాలల ద్వారా ఈ సంఘమే అమ్మిస్తున్నది" అని అన్నారు.

"గత నాలుగు సంవత్సరాలలో సెస్సు నిధినుంచి భారత ప్రభుత్వం ద్వారా ఈ సంఘంవారు ఆంధ్రలోని ప్రాథమిక సంఘాలవారు ఎంత సహాయాన్ని, ఏఏ రూపాల్లో పొందగలిగిందీ వీరభద్రరావుగారు వివరించారు.

"మొత్తం 185.36 లక్షల రూపాయలలో కేవలం 15.49 లక్షల రూపాయలు మాత్రమే గ్రాంట్లు రూపంలో మాకు లభించింది. కొనుగోలుదారులకు చేనేతబట్ట కొనుగోలుమీద 61.16 లక్షల రూపాయలు రిబేటుక్రింద, కేంద్ర సంఘానికి, ప్రాథమికసంఘాలకు కలిపి 108.71 లక్షల రూపాయలు అప్పులక్రింద యివ్వబడింది. ఈ అప్పులన్నీ కూడా కనీసం పదిసంవత్సరాలలోపు భారత ప్రభుత్వానికి తిరిగి చెల్లించి వెయ్యాలి.

ఆంధ్రలోని చేనేత కేంద్రాలు

ఆంధ్రదేశంలోని చేనేత కేంద్రాలన్నింటికంటె పెద్దదయిన చీరాలలో రెండవ సహకార మిల్లును స్థాపించడానికి మనరాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం సంతోషించదగ్గ విషయం. రెండురోజుల క్రితమే రెవిన్యూశాఖామాత్యులు చీరాలలో త్వరలో ఈ మిల్లును నిర్మింపగల స్థానికి ప్రారంభోత్సవం జరిపారు. తమకు కావలసిన నూలును ఏ ధరకు కొంటున్నామో ఆ ధరకు నూలును చేనేత పారిశ్రామికులకు యివ్వగల మిల్లులు ఎన్నైనా అవసరం.

మా చేనేత ఫ్యాక్టరీలలో ఉత్పత్తి చేయబడి ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలోని మా అభిరుచులకు అనుగుణ్యమైన కొత్తరకాల వస్త్రాలను చూచి మీరు ఆనందించి, ఆదరించగలరని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య ప్రసంగిస్తూ దేశానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిన పురాతన చేనేతపరిశ్రమ ఇప్పుడు డాలర్లు సంపాదించగలదనీ, ప్రభుత్వం ఆపరిశ్రమను రక్షించి పోషించాలనీ అన్నారు.

శ్రీ కళా వెంకటరావు తన ప్రారంభోపన్యాసంలో, ఉపన్యాసాల వల్ల లాభంలేదనీ, మన మనసులు మార్చుకొని చేనేత బట్టను ఎక్కువగా వాడితేనే ఈ పరిశ్రమ అభివృద్ధిచెందగలదనీ అన్నారు. చైనాలో స్త్రీలు తమ పరికిణీలను ఒక అంగుళం ఎక్కువ పొడవు పెంచి ధరిస్తే మాంచెస్టరులోని మిల్లులకు ఆశించినపని దొరుకుతుందని చెప్పినట్లుగా, మనదేశీయులు మనచేతి పరిశ్రమలను ప్రోత్సహించవలసిందిగా కోరారు. చేనేత పారిశ్రామికులు తమ ఉత్పత్తిని పెంచాలని ఉత్పత్తి పెరిగితేనే దేశం ఆర్థికంగా, సాంఘికంగా పురోభివృద్ధిచెందగలదనీ అన్నారు. చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన డాక్టరు అచ్చమాంబ గారు స్త్రీలు చేనేత గుడ్డను విరివిగా వాడాలని హెచ్చరించారు.

రాష్ట్రపతి డాక్టరు రాజేంద్రప్రసాద్, హోంశాఖామంత్రి గోవిందవల్లభ్ పంత్, యు. ఎన్. ధేబర్, వైకుంఠలాల్ మెహతా, ప్రభృతులు పంపిన సందేశాలు కార్యదర్శి శ్రీ గంపల సూర్యం చదివారు.

శ్రీ ప్రగడ కోటయ్య అభినందనలతో సభ ముగిసింది. తరువాత కూచిపూడి భామాకలాప ప్రదర్శన జరిగింది.

హైద్రాబాదులో

హైద్రాబాదు, ఫిబ్రవరి 8

నేడు హైద్రాబాదు నగరంలో చేనేత వారోత్సవాలను శాసనసభ స్పీకరు శ్రీ కాళేశ్వరరావుగారు ప్రారంభించారు. ఉత్సవ సభకు కార్మిక మంత్రి శ్రీ సంజీవయ్యగారు అధ్యక్షత వహించారు.

జవుళి అధికారి శ్రీ జోసఫ్ రెడ్డి గారు ప్రసంగిస్తూ హైద్రాబాదు, చీరాలల్లో సహకార నూలుమిల్లుల స్థాపనకు ఏర్పాట్లు జరిగాయన్నారు. హైద్రాబాదులో ఇందుకు కావలసిన ధనం సమకూరిందనీ, ఒకటిన్నర సంవత్సరాల్లో పని ప్రారంభమౌతుందనీ ఆయనచెప్పారు. ఇక్కడ 20 కౌంటులనూలు, చీరలలో సన్నమూలు తయారవుతుందన్నారు.

చేనేతవారిని సహకారసంఘాలలో చేర్పించడంలో ఆంధ్రదేశం గొప్ప విజయం సాధించిందన్నారు. మన రాష్ట్రంలో మొత్తం 6 లక్షలమంది చేనేతవారున్నారనీ ఇందులో రెండున్నర లక్షలమంది సహకార సంఘాలలో వున్నారనీ చెప్పారు. ఇంతపెద్ద శాతం ఏరాష్ట్రంలోనూ లేదన్నారు.

చీరలను ధోవతులను చేనేతకు కేటాయించాలని శ్రీ కాళేశ్వరరావుగారు అన్నారు. ఆంధ్ర తెలంగాణా సహకార సంఘాలు ఇప్పుడు వేర్వేరుగా వున్నాయనీ, అవిరెండూ లీనమై ఒకే సంస్థగా రూపొందవలసిన అవసరం ఉన్నదనీ ఆయన చెప్పారు.

అధ్యక్షత వహించిన సంజీవయ్యగారు ప్రసంగిస్తూ రాష్ట్రానికి 50-60 లక్షల రూపాయల చేనేత ముదరా వస్తున్నదన్నారు. ఇది మధ్య దళారీలకు కాకుండా నేరుగా చేనేత కార్మికుల కందేటట్లు ఒక పథకాన్ని తయారుచేయవలసి వుందన్నారు.

కేరళలో

త్రివేంద్రం, ఫిబ్రవరి 8

కేరళ చేనేత సప్తాహానికి ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ నేడిక్కడ ప్రారంభోత్సవం చేశారు.

"గత నాలుగైదేళ్ళ నుండి చేనేత బోర్డు చేస్తున్న కృషిని గురించి వివరంగా తెలుసుకోవడానికి వీలుకాలేదు. అయినప్పటికీ తీవ్రపరిస్థితి నుండి ఈ పరిశ్రమను రక్షించడంలో బోర్డు కొంత వరకు తోడ్పడింది. ఈ పరిశ్రమలో పనిచేస్తున్నవారందరూ ఇతర పరిశ్రమలకు ఆదర్శంగా వుండాల"ని శ్రీ నంబూద్రిపాద్ కోరారు.

గత ఐదేళ్ళలో దిగుమతుల సమీక్ష

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8

గత అయిదేళ్ళలోను భారతదేశం విదేశాలనుంచి దిగుమతులు చేసుకొన్న సరుకులలో ఏఏ రకానికిచెందినవి ఎన్నెన్నికలవో పరిశీలించేందుకు ఆర్థికప్రణాళికా సంఘంవారు కేంద్ర మంత్రి శ్రీ కృష్ణమీనన్ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించారు. వారు జరిపిన దర్యాప్తులో వాడకం వస్తువులే చాలా హెచ్చుగా వున్నట్లు తేలింది.

(పి. టి. ఐ.)

సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (అధ్యక్షుడు) :
కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి.
ఎడిటర్, ప్రింటర్ & పబ్లిషర్ : విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున
కాట్రగడ్డ రాజగోపాలరావు. స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, విజయవాడ - 2.

దేశమంతటా చేనేత సప్తాహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8

దేశమంతటా చేనేత [illegible] సప్తాహం ప్రారంభమైంది. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్, మద్రాసు, బొంబాయి వగైరా రాష్ట్రాలలో అనేకచోట్ల చేనేత వస్తువులను ప్రదర్శించారు.

ఢిల్లీచేనేత సప్తాహాన్ని, చేనేత వస్త్రప్రదర్శనాన్ని హోం మంత్రి పండిత పంత్ ప్రారంభించారు. జాతీయ ఆర్థికసంపదలో చేనేత పరిశ్రమ ప్రధానపాత్ర వహిస్తుందని చెప్పారు. దీనివల్లఅనేకమందికి పనులు దొరుకుతాయి. మనకు అత్యవసరమైన విదేశీమారకద్రవ్యం లభిస్తుందన్నారు.

విదేశ మార్కెట్లలో మన చేనేత వస్తువులకు గిరాకీ ఎక్కువవుతున్నది. అందువల్ల కొత్తడిజైన్లపై మనం కేంద్రీకరించి పని చేయవలసివుంది. అలాగే వస్తువుల నాణ్యాన్ని అభివృద్ధి పరచవలసివుంది. గత మూడు నాలుగేళ్ళలోను అమెరికాకు మన చేనేత ఎగుమతులు పదిరెట్లు పెరిగాయి. ఎగుమతులు మరింత పెరిగే అవకాశంవుంది. ద్వితీయ ప్రణాళికలో 2200 కోట్ల గజాల చేనేతవస్త్రాలు తయారుచేయాలనుకొన్నాము. మనం ఈ లక్ష్యాన్ని పూర్తిచేయాలి. చేనేత మార్కెటింగ్ పద్ధతిని అభివృద్ధి పరచాలని పండిత పంత్ చెప్పారు.

ముంద్రాపై మరొక కేసు

కలకత్తా, ఫిబ్రవరి 8

ఆస్లార్ కంపెనీ డైరెక్టర్లబోర్డు అధ్యక్షుడైన శ్రీహరిదాస్ ముంద్రాపై కంపెనీల చట్టంక్రింద కలకత్తా మేజిస్ట్రేట్ కోర్టులో మరొక కేసు నడుస్తోంది.

ఆస్లార్ కంపెనీ తరఫున 1949లో కలకత్తాలోని రెండు భవనాలను ఖరీదు చేసినట్లు, అందుకుగాను రు 8 లక్షల పైచిలుకు మొత్తం చెల్లించినట్లు ఆ కంపెనీ లాభనష్టాల పట్టికలో (1951) పేర్కొన్నారనీ, వాస్తవానికి ఆ భవనాలకు అసలు డబ్బేమీ చెల్లించలేదనీ శ్రీ ముంద్రాపై కలకత్తా మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలుచేసిన అభియోగంలో ఉదాహరించారు. ఆ భవనాల యజమానులకు ప్రతి నెలా రు. 8 వేల చొప్పున ఇప్పటివరకు అద్దె చెల్లిస్తున్నారనీ, అయితే ఆలెక్క ఆస్లార్ కంపెనీ ఖాతాలలో ఎక్కడా వ్రాయలేదనీ కూడా ఈ అభియోగంలో పేర్కొన్నారు.

ఆ భవనాలక్రింద మొత్తం రు. 5 లక్షలు చెల్లించినట్లు శ్రీ ముంద్రా చెప్పుతున్నారు.

ఆస్తుల రాబడిపై సర్ ఛార్జీ విధింపు

విజయవాడ కౌన్సిల్ అసమ్మతి

విజయవాడ, ఫిబ్రవరి 7

కొన్ని పురపాలక సంఘాలలోని ఆస్తుల రాబడిపై సర్ ఛార్జీని విధించే పన్నును ఆంధ్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టనున్నది. ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవలసిందిగా కోరుతూ ఒక తీర్మానాన్ని విజయవాడ పురపాలక సంఘం వారు నిన్న సాయంత్రం డాక్టరు దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమోదించారు. ఉపాధ్యక్షులు శ్రీ టి. వెంకటేశ్వరరావు తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ఈ సర్ ఛార్జీ విధింపువల్ల అసలే పన్నుల భారంతో క్రుంగిపోతున్న మధ్యతరగతి ప్రజలు ఇంకా అణగారిపోయే ప్రమాదం వున్నదన్నారు. దీన్ని ఉపసంహరించుకొని ప్రభుత్వం క్రమానుగత పన్నుల పద్ధతి ప్రవేశపెట్టాలని కోరారు.

రు. 420 లకు పైగా ఆదాయం వచ్చేవారిపై నూటికి 5 వంతులూ, రు. 1250 లకు పైగా ఆదాయం వచ్చేవారిపై నూటికి 7½ వంతులు, రు. 1800 అంతకు మించి ఆదాయం వచ్చే వారిపై నూటికి పదివంతులూ చొప్పున సర్ ఛార్జి విధించాలని ప్రభుత్వం ఉద్దేశం.

ఈ సర్ ఛార్జీవల్ల విజయవాడ పురపాలకసంఘానికిసుమారు రు.67,283లు ఆదాయం వస్తుందని అంచనా.

* * *

"ఆజాద్ కాశ్మీర్ సైన్యానికి" చెందిన ముగ్గురు సీనియర్ ఉద్యోగులకు పాకిస్తాన్ ప్రభుత్వం కఠిన జైలుశిక్షలు విధించినట్లు విశ్వసనీయ వర్గాలద్వారా తెలిసింది.

లంక - రష్యా వర్తక సంధి

కొలంబో, ఫిబ్రవరి 8

లంక, సోవియట్ దేశాలు మధ్య తొలిసారిగా వర్తక ఒడంబడిక కుదిరింది. దీనిపై నేడు మహోత్సాహంతో సంతకాలు జరిగాయి.

లంకలో ప్రధానమైన పంటలు టీ, రబ్బరు, కొబ్బరి మొదలైనవాటికి ఈ ఒడంబడికతో పెద్ద మార్కెట్టు లభించింది. పెట్రోలియం సరకులు, సిమెంటు, నూలు బట్టలు, రసాయనిక పదార్థాలు, యంత్రాలు మొదలయినవి పుష్కలంగా సప్లయి అయే మార్గం కూడా లభించింది.

రెండు దేశాలు పరస్పరం మూడు లక్షల స్టెర్లింగులవరకు సరకులు అప్పు ఇవ్వడానికి ఈ ఒడంబడిక అవకాశం ఇస్తోంది.

ఉభయ దేశాలమధ్య వర్తకం విషయంలో ఈ ఒడంబడిక ఏలాంటి పరిమితులూ విధించడం లేదు.

లంకతరఫున ఎగుమతి,దిగుమతులు చేసేవారంతా లంక పౌరులుగానే ఉండాలన్న నిబంధన ఒకటి ఈఒడంబడికలో గమనించదగినదని వర్తక శాఖమంత్రి సేనానాయకె తెలిపారు.

ఉభయదేశాలమధ్య స్నేహ, సహకారాలు ఇంకా పెంపొందేందుకు ఈ ఒడంబడిక ఎంతైనా అవకాశం కలిగిస్తున్నదని, ఉభయ దేశాల ప్రతినిధి వర్గనాయకులన్నారు.

సాహిత్య అకాడమీ కార్యవర్గ సమావేశం

హైద్రాబాదు, ఫిబ్రవరి 8

ఆంధ్ర సాహిత్య అకాడమీ కార్యవర్గంవారు నిన్న నిక్కడ సమావేశమై సామెతలు, నుడికారాలపై గ్రంథాలనుఈ సంవత్సరాంతంలోగా ప్రచురించడానికి నిశ్చయించారు.

సామెతల సంపుటిని 1958 ఆగస్టు నాటికి ప్రచురించాలని నిశ్చయించారు. దీనికి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారిని ప్రధాన సంపాదకులుగా నియమించారు.

నుడికారాల సంపుటినికూడా ఈ సంవత్సరాంతంలోగా ప్రచురించాలని నిశ్చయించారు. దీనికి నార్ల వెంకటేశ్వరరావుగారిని ప్రధాన సంపాదకులుగా నియమించారు.

మాండలికాలపై సి. నారాయణ రెడ్డిగారు సమర్పించిన నివేదికను కార్యవర్గంవారు ఆమోదించారు.

ఉత్తమగ్రంథాలకు బహుమానాలు నిర్ణయించడంకోసం ఒక బహుమాన నిర్ణాయక సంఘాన్ని నియమించారు. ఇందులో శ్రీయుతులు నార్ల వెంకటేశ్వరరావు, విశ్వనాథసత్యనారాయణ, అబ్బూరి రామకృష్ణారావుగార్లు సభ్యులుగా వున్నారు. (వి. పి.)

డా. హో ముందు బడిపిల్లల విన్యాసాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7

డాక్టర్ హోచిమిన్ ముందు ఢిల్లీ బడిపిల్లలు మూడువేలమంది క్రీడా విన్యాసాలు ప్రదర్శించారు. సైబం నృత్యం, డ్రిల్లు, గుజరాత్ గర్భ నృత్యం మున్నగునవి చూసి ఆయన ఎంతో మెచ్చుకున్నారు. వియత్నాం బాలబాలికల తరఫున ఆయన వారి నభినందించారు.

మీరిక నన్ను వియత్నాం అధ్యక్షునిగా భావించకండి. మీ నెహ్రూలాగే నేనుకూడా మీకు చాచా మాత్రమే. మీరు బుద్ధిగా చదివి, క్రమశిక్షణతో మెలగి మీ చాచా నెహ్రూకు కీర్తి తెచ్చేవాళ్ళై వుండండి" అని ఆయన ఉద్బోధించారు. వియత్నాం బాలల తరఫున ఢిల్లీ బాలలకు ఆయన మూడు చిత్రపటాలను బహూకరించారు. అందులో ఒకటిగాంధీజీది. రెండవది నెహ్రూది. ఇదివరకే మంత్రిగా వున్నారు.

అమెరికా ఖండాంతర రాకెట్ ప్రయోగం

కేప్ కానవెరాల్, ఫిబ్రవరి 7

అమెరికా విమానదళంవారు నేడొక ఖండాంతర రాకెట్ ను ప్రయోగించారు. ఇది 5000 మైళ్ళవరకు వెళ్ళగలుగుతుంది. కాని ప్రస్తుతం ప్రయోగించిన రాకెట్ ను [illegible] పరిమితం చేశారు.

బెనర్జీ దళం బుర్రకథ

ఫిబ్రవరి 10న హైద్రాబాద్ రేడియోనుంచి ప్రసారం

హైద్రాబాదు, ఫిబ్రవరి 8

అఖిలభారత బహుమానాన్ని సంపాదించిన బెనర్జీ దళంవారి బుర్రకథను సోమవారం 10 వ తేదీ సాయంత్రం 6 గంటల 15 నిమిషాలకు హైద్రాబాదురేడియో కేంద్రం నుంచి ప్రసారం చేస్తారు. (వి.పి.)

రాయబారుల నియామకం

నవచైనాకు సుకుమారసేన్, కైరోలో రాయబారిగా శ్రీ ఆర్. కె. నెహ్రూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8

ప్రస్తుతం ఎలెక్షన్ కమిషనర్ గా పనిచేస్తున్న శ్రీ సుకుమార్ సేన్ పెకింగ్ లో భారతరాయబారిగా నియమింప బడవచ్చునని తెలుస్తోంది.

ఇంతవరకు చైనాలోరాయబారిగా పనిచేసిన శ్రీ ఆర్. కె. నెహ్రూ పెకింగ్ నుంచి ఢిల్లీకి తిరిగి వచ్చారు. ఈయనను కైరోలో రాయబారిగా కేంద్రప్రభుత్వం నియమిస్తుందని తెలుస్తోంది.

ప్రస్తుతం కైరోలో రాయబారిగా పని చేస్తున్న అలీయావర్ జంగ్ ను ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధిగా నియమిస్తారని భావింప బడుతున్నది. (ఐ. పి. ఏ)

ఇండోనేషియాకు రష్యా వర్తక నావలు

ఇవ్వడానికి సంసిద్ధత

జకార్తా, ఫిబ్రవరి 7

మొత్తం 20 వేల టన్నుల బరువు గల పది నావలను ఇండోనేషియాకు ఇవ్వడానికి సోవియట్ తనసంసిద్ధతను తెలిపిందని ఇండోనేషియా వర్తక నౌకాశాఖ అధికారి నేడు పత్రికా విలేఖరులకు చెప్పారు. ఇండోనేషియా సిబ్బంది సహాయంతో ఈ నావలను నడపడానికి కాప్తనులను కూడా సోవియట్ పంపుతానని తెలిపిందన్నారు.

పోలెండు, యుగోస్లావియా దేశాలుకూడా నావలను సప్లయిచేస్తామన్నాయనీ, ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలిస్తున్నదనీ ఆ అధికారి అన్నారు.

జపానునుండి అమెరికా సేనల ఉపసంహరణ

టోకియో, ఫిబ్రవరి 8

జపానులోని అమెరికా భూతల సేనలనన్నిటినీ అమెరికావారు ఉపసంహరించారని నేడిక్కడ అధికార ప్రకటన జరిగింది. 1945 లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత కూడా అమెరికా సేనలు జపానులోనే తిష్టవేసిన విషయం పాఠకులకు విదితమే.

జపానులో అనేకచోట్ల అమెరికా విమానస్థావరాలూ, నైమానిక దళాలూ ఇంకా ఉన్నాయి. వీటి విషయమై దేశమంతటా తీవ్రమయిన ఆందోళన సాగుతూంది.

పాక్ మంత్రివర్గంలో మరొక హిందువు

కరాచీ, ఫిబ్రవరి 7

పాకిస్తాన్ కేంద్ర శాసనసభలోని నేషనల్ కాంగ్రెసు పార్టీ నాయకుడయిన వసంతకుమార్ దాస్ ని ఈ వేళ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఈయనకు కేంద్ర కార్మిక, విద్యా శాఖలు అప్పగించారు. వీరి వయసు 75 సంవత్సరాలు. ప్రస్తుత నూన్ మంత్రివర్గంలో కె. కె. దత్తా అనే హిందువు ఇదివరకే మంత్రిగా ఉన్నారు.

పాత్రికేయుల మహాసభ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8

అఖిలభారత పాత్రికేయులసమాఖ్య 6 వ వార్షిక మహాసభ మార్చి 15-17 తేదీలలో జైపూర్ లో జరుగుతుంది.

హైద్రాబాదు, ఫిబ్రవరి 7

లాలాగూడా వర్కుషాపు, మెట్టుగూడా వర్కుషాపులలో రైల్వేవారు వైద్యశాలలను నిర్మించారు. ఇక్కడ ఒక డాక్టరు, నర్సు, కాంపౌండరు మున్నగువారు [illegible] సహాయంకోసం ఎప్పుడూ వుంటారు.

షేక్ అబ్దుల్లా ధోరణి

జాతీయ మహాసభ నాయకుని ఖండన

శ్రీనగర్, ఫిబ్రవరి 7

కాశ్మీర్ విలీనీకరణకు వ్యతిరేకంగా షేక్ అబ్దుల్లా ఇటీవలచేసిన ప్రసంగాలను ఖండిస్తూ జాతీయ మహాసభ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక పెద్ద సభలో తీర్మానించారు. భారతదేశంతో కాశ్మీర్ విలీనీకరణను కాశ్మీర్ ప్రభుత్వం, ప్రజలు కూడా ఆమోదించారని యీ తీర్మానంలో స్పష్టం చేశారు. ఈ సభ జరుగుతున్న సమయంలోనే నగరంలోని మరో ప్రాంతం, జమ్మా మసీదులో షేక్ అబ్దుల్లా ప్రసంగం జరుగుతూంది.

జాతీయ మహాసభ సమావేశంలో శాసన సభ్యుడు శ్రీ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ శ్రీ అబ్దుల్లా, మతాన్ని తీసుకొనివచ్చి రాజకీయాలతో ముడిపెడుతున్నందుకు నిరసించారు. దీనినిబట్టిచూస్తే ఆయనలో నిస్పృహ వ్యాపించినట్లు ద్యోతకమవుతుందనీ, ఈ నిస్పృహతోనే ఆయన కాశ్మీర్ ప్రజలను తప్పుదోవ పట్టించుతున్నారనీ, భారతదేశ అంతర్భాగంగా కాశ్మీర్ పురోగమనాన్ని ఆ విధంగా అడ్డుకుంటున్నారనీ అన్నారు. కాశ్మీరు ప్రజలు తమ స్వాతంత్ర్యంకోసం ఎనలేనిత్యాగాలు చేసి, పాకిస్తాన్ సాయుధ దాడిని ఎదుర్కొన్న విషయం శ్రీ అబ్దుల్లా గుర్తించాలనీ, మతప్రసక్తిలేని రాజ్యాంగం కోసం, పురోగామి సిద్ధాంతాలకోసం కాశ్మీర్ యువకులు తమ ప్రాణాలను అర్పించారనీ అన్నారు. కాశ్మీర్ లో నడచిన ఈ అభివృద్ధికర రాజకీయ ఉద్యమాలను దృష్టిలోకి తెచ్చుకొని, శ్రీ షేక్ అబ్దుల్లా మత రాజకీయాలను విడనాడాలని శ్రీ రహమాన్ విజ్ఞప్తి చేశారు.

మరొక జాతీయమహాసభసభ్యుడు శ్రీ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ, ఈ వేళ షేక్ అబ్దుల్లా తానొక నిజమైన ముస్లిముగా చెప్పుకుంటున్నారనీ, నిజమైన ముస్లిం ఆడినమాట తప్పేకంటే మృత్యువునే కోరుకుంటాడనీ అన్నారు.

"భారతదేశానికి చేసిన వాగ్దానాలను,ప్రతిజ్ఞలను మరచిపోయేటంతగా శ్రీ అబ్దుల్లా జ్ఞాపకశక్తి మందగించిందా? కాశ్మీరులో జనవాక్య నిర్ధారణ కావాలని శ్రీ అబ్దుల్లా అంటే అనవచ్చుగాక. దీనిని అవకాశంగా తీసుకొని పాకిస్తాన్ బాకా ప్రచారం చేస్తే చేయవచ్చుగాక! కాని కాశ్మీర్ ప్రజలు భారతదేశంలో అంతర్భాగంగా పురోగమించడం తథ్యమని ప్రపంచానికిఇదివరకేస్పష్టంచేశాము" అని శ్రీ ఖుద్దూస్ అన్నారు.

నాజర్ కువాట్లీ చర్చలు

(1 వ పేజీ తరువాయి)

ఈజిప్టు సిరియాలు వేర్వేరుగా [illegible] కలిసివున్నప్పుడు [illegible] పెరుగుతుందనడంలో సందేహంలేదు. అరబ్బు ప్రపంచంలో ఎక్కడ ఏమాత్రం ఐక్యత ఏర్పడినా అది అరబ్బులబలాన్ని ఇనుమడింప చేస్తుంది అని అలేఖ్యలో పేర్కొన్నారు.

అందమునకు
సుఖమునకు
మన్నికకు

CANVAS AND
RUBBER SHOES

ALEN & CO.

అడగండి:

AC-1

అలెన్ & కో
త్రిహీ హౌస్, 81, మహమ్మదాలీ రోడ్
పోస్టుబాక్సునెం 3120, బొంబాయి—3
వ్యాపార షరతులకు ఉత్తర ప్రత్యుత్తరములు కోరబడును.

5 వ అఖిలభారత చేనేత వారోత్సవం
1958 ఫిబ్రవరి 8 నుండి 15 వరకు
గుర్తుంచుకోండి
●
'హైకో' — చేనేతవస్త్రాలలో ఉత్తమమైనపేరు
'హైకో' — సొగసైన అందమునకు, దీర్ఘకాల మన్నికకు పేరు
'హైకో' — ప్రశస్తము, ప్రఖ్యాతులకు మారుపేరు
'హైకో' — నేర్పరులైన తెలంగాణ చేనేత కార్మికులచే నేయబడిన రోజువారి ఉపయోగమునకు ఉత్తమమైన వస్త్రం.
అమ్మకం : మధ్యవారి లాభాయిలేని సరసమైన ధరలకు
వివరాలకు
ది హైద్రాబాద్ హాండ్ లూమ్ వీవర్స్
కో ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్
గ్రామ్స్ : WEAVERS నారాయణగూడ - హైద్రాబాద్. ఫోన్ 3703.
గమనిక : స్పెషల్ రిబేటు రూపాయికి 12 నయాపైసలు
ఇచట ఖర్చుచేయు ప్రతిదమ్మిడీ బీద చేనేత కార్మికునకు చెందును.